STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక


విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 111 | ఎడిటర్ : అలీ ముర్తుజా | మంగళవారం 03 నవంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |

విదేశీ మద్దతుతోనే మోదీ ప్రధాని!




- పటేల్ జయంతి రోజున మోదీ చేసిన వ్యాఖ్యలకు రాహుల్ కౌంటర్
- భారత ఆర్థిక వ్యవస్థ పూర్తిగా విదేశీయుల చేతుల్లోనే ఉందని విమర్శ
- దమ్ముంటే ఏ వేదిక మీదకైనా బహిరంగ చర్చకు రావాలని సవాల్

.. వివరాలు 4లో

స్వచ్ఛ ఇంధనంతోనే ఆర్థిక భద్రత!

- శిలాజ ఇంధనాలపై ఆధారపడితే ఆర్థిక వ్యవస్థలకు ముప్పే
- 2030 లక్ష్యాన్ని ఐదేళ్ల ముందే సాధించిన భారత్
- భారత్ రెన్యువబుల్ ఎనర్జీ సదస్సులో ప్రధాని మోదీ



4

కాంగ్రెస్ అరాచకత్వాన్ని అంతం చేయాలి!

బీజేపీ మహా పాదయాత్రలో కేంద్ర మంత్రి అమిత్ షా

4



అలసత్వం వద్దు

ఎక్కడా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకూడదు

కురిసే ప్రతి బొట్టుతో చెరువులు, రిజర్వాయర్లు నింపాలి



48 గంటల్లోనే పునరుద్ధరణ పనులు పూర్తి కావాలి

'మురసు' తుఫానుపై అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలకు భారీ వర్ష సూచన

> అర్నబ్ తుఫాను ముగిసిందో లేదో.. ఇప్పుడు 'మురసు' రూపంలో రాష్ట్రానికి మరో ముప్పు పొంచి ఉంది. అయితే ఈ విపత్తును జల అవకాశంగా మార్చుకుని, వచ్చే సుమారు 50 టీఎంసీల వరద నీటితో ప్రాజెక్టులన్నీ నింపేలా అడుగులు వేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. మురసు తుఫాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో చేపట్టిన ముందస్తు చర్యలు, క్షేత్రస్థాయి సన్నద్ధతపై సోమవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు.

అమరావతి, నవంబర్ 2 (సమయం న్యూస్): రాష్ట్రంలో మురసు తుఫాను ప్రభావంతో ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడదని.. అదే సమయంలో వచ్చే భారీ వరద నీటిని వృథా పోనివ్వకుండా చెరువులు, రిజర్వాయర్లను నింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మురసు తుఫాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో చేపట్టిన ముందస్తు చర్యలు, క్షేత్రస్థాయి సన్నద్ధతపై సోమవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో వర్చువల్‌గా మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. ఇటీవల వచ్చిన అర్నబ్ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో అప్పుడప్పుడే సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయని సీఎం తెలిపారు. అర్నబ్ తుఫానుతో పోలిస్తే మురసు తుఫాను ప్రభావం తక్కువగా

మిగతా 2 లో



క్షీణించిన శాంతిభద్రతలు

రాప్తాడు ఘటనే ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం

బాధిత విద్యార్థినికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

లేదంటే మేం అధికారంలోకి రాగానే ఆదుకుంటాం

3

బెంగళూరులో గోపికను పరామర్శించిన వైఎస్ జగన్

ఏపీలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, రాప్తాడు జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థిని గోపికపై జరిగిన దాడే ఇందుకు నిదర్శనమని మాజీ సీఎం, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. పాఠశాలల్లోకి ఆయుధాలతో బయటి వ్యక్తులు వస్తుంటే అడ్డుకునేవారు లేకపోవడం భద్రతా వైఫల్యాన్ని ఎత్తిచూపుతోందని మండిపడ్డారు.

మురసుపై అప్రమత్తం!

- లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే తరలించాలి
- తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలి
- నెల్లూరుకు సమీపంలో తీరం దాటే అవకాశం
- అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ దిశానిర్దేశం



2

ప్రతి ఓటూ కాపాడుకోవాలి!

- కౌంటింగ్ కేంద్రాల్లో పూర్తి అప్రమత్తంగా ఉండాలి
- 5న జరిగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ పోరుకూ సిద్ధం కావాలి
- సజ్జల రామకృష్ణారెడ్డి



స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపులో ప్రతి ఓటునూ కాపాడుకునేలా పార్టీ నాయకులు, ఏజెంట్లు పూర్తి అప్రమత్తతో వ్యవహరించాలని వైఎస్సార్సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం జరిగే కౌంటింగ్‌లో అధికార పార్టీ అక్రమాలకు పాల్పడే అవకాశం ఉన్నందున అడుగడుగునా నిఘా పెట్టాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

3

ఆరు నెలల్లో పీఆర్సీ రిపోర్ట్ ఇవ్వాలి!

ఇప్పటికే 12వ వేతన సవరణ సంఘం నియామకంలో జాప్యం

పీఆర్సీ కమిషనర్‌కు ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర నాయకత్వం విజ్ఞప్తి



2



రిగ్గింగ్‌పై సమగ్ర విచారణ జరపాలి!

- బూత్ క్యాప్చరింగ్, దొంగ ఓట్లపై ఈసీ స్పందించాలి
- అక్రమాలు జరిగిన చోట రీ-పోలింగ్ నిర్వహించాలి
- ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

2

భయపడలేదు.. వెనక్కి తగ్గలేదు!

స్నేహితురాలి కోసం ప్రాణాలకు తెగించిన లక్ష్మి

- చైన్నాతో దాడి చేస్తున్నా వీడని ధైర్యం
- రాప్తాడు ఘటనలో బాలిక సాహసానికి మంత్రి లోకేశ్ ఫిదా
- ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ

2






2

గోపిక చికిత్సకు రూ.2 లక్షలు!

ఆసుపత్రికి ప్రభుత్వం తరఫున చెల్లింపులు



హెచ్‌పీసీఎల్‌లో అగ్నిప్రమాదం

- నూతన సల్ఫర్ ప్లాంట్‌లో మంటలు
- ఆందోళన చెందొద్దని అధికారుల ప్రకటన

3

అలసత్వం వద్దు



మురసు తుఫాను గాలుల ప్రభావంతో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో సుమారు 8 వేల విద్యుత్ స్తంభాల వరకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని అంచనా వేశారు. ఆ నష్టాన్ని వెంటనే పూడ్చేందుకు అవసరమైన సామగ్రి, సిబ్బందితో విద్యుత్ శాఖ పూర్తి సిద్ధంగా ఉందని సీఎంకు వివరించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, ఆర్టీజీఎస్, వ్యవసాయ, జలవనరులు, అగ్నిమాపక శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయి..)

ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేసినప్పటికీ, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు.

50 టీఎంసీల వరద అంచనా..

ఈ తుఫాను వర్షాల కారణంగా సుమారు 50 టీఎంసీల వరకు వరద ప్రవాహాలు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ముఖ్యంగా నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల పరిధిలో 13 నుంచి 15 టీఎంసీల నీరు చేరవచ్చని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ వర్షాలను సమర్థంగా వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం తదితర ప్రాంతాల్లో సమర్థవంతమైన నీటి నిర్వహణ ద్వారా ఆయకట్టులోని చెరువులన్నీ నింపాలని ఆదేశించారు. దక్షిణ కోస్తా, రాయలసీమ బేసిన్ పరిధిలోని వివిధ రిజర్వాయర్లలో నీటిని నిల్వ చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

48 గంటల్లో పునరుద్ధరణ పనులు..

కలెక్టర్లు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయాలని, సమాచార వ్యవస్థకు అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సీఎం స్పష్టం చేశారు. తుఫాను వెలిసిన వెంటనే అనంతర పునరుద్ధరణ పనులను 48 గంటల్లోనే యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అలాగే పంటల బీమా పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

విద్యుత్ శాఖ పక్కా ప్లాన్..

అర్నబ్ తుఫాను సమయంలో శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు సుమారు 31 వేల విద్యుత్ స్తంభాలను క్షేత్రస్థాయికి ముందుగానే తరలించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పుడు



మురసుపై అప్రమత్తం!

లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే తరలించాలి

తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలి

నెల్లూరుకు సమీపంలో తీరం దాటే అవకాశం

అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ దిశానిర్దేశం

అమరావతి, నవంబర్ 2 (సమయం న్యూస్): అర్నబ్ తుపాను విధ్వంసం నుంచి రాష్ట్రం పూర్తిగా కోలుకోకముందే 'మురసు' తుపాను రూపంలో ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైన చోట పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. మురసు తుపాను సన్నద్ధతపై ఆయన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్డబ్ల్యూఎస్ శాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పోలీస్, రెవెన్యూ, విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. తొలుత బాపట్లఉమచిలీపట్నం మధ్య తుపాను తీరం దాటుతుందని అంచనా వేయగా.. ప్రస్తుతం అది దిశ మార్చుకుని సోమవారం మధ్యాహ్నం నెల్లూరుకు సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని అధికారులు పవన్ కళ్యాణ్‌కు వివరించారు. ఆ సమయంలో గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం ఉందని, ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. దీంతో నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, తిరుపతి, మార్కాపురం జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున ఆయా జిల్లాల అధికారులను పవన్ అప్రమత్తం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఆరు ఎన్డీఆర్ఎఫ్, ఏడు ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు అధికారులు వెల్లడించారు.

రోడ్లపై చెట్లు తొలగించండి..

గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. వర్షాలకు దెబ్బతిన్న గ్రామీణ రహదారులు, కల్వర్టులను వెంటనే పునరుద్ధరించాలని, రోడ్లపై కూలిన చెట్లను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని సూచించారు. వాగులు, వంకల్లో నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి, ఉద్ధృతంగా ప్రవహించే చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, వర్షాలు తగ్గిన వెంటనే గ్రామాల్లో బ్లీచింగ్, క్లోరినేషన్ చేపట్టేందుకు సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు నేలకొరిగితే వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలన్నారు. తుపాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా కఠినంగా చూడాలని అధికారులకు పవన్ సూచించారు. అత్యవసర వైద్య సేవలకు ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పంట నష్టాన్ని తగ్గించేందుకు రైతులకు ముందస్తు సూచనలు ఇవ్వాలని, నీట మునిగిన పొలాల నుంచి వర్షపు నీటిని వెంటనే బయటకు పంపేలా చూడాలన్నారు. ప్రభుత్వం జారీ చేసే హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ, వాళ్లు సురక్షిత ప్రాంతాల్లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రైతులను ఆదుకోండి!

- ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు బీమా పరిహారం అందేలా చూడాలి
- క్లెయిమ్‌లపై అన్నదాతల్లో విస్తృత అవగాహన పెంచండి
- పంట నష్టంపై తక్షణమే అంచనాలు రూపొందించండి
- సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి, నవంబర్ 2 (సమయం న్యూస్): ప్రకృతి వైపరీత్యాల వేళ సర్కారు ఇచ్చే సబ్సిడీకి తోడు బీమా పరిహారం కూడా పక్కాగా అందించి రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు బీమా సొమ్ము సకాలంలో అందితే అన్నదాతలకు ఆర్థికంగా ఎంతో ఊరట లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వ్యవసాయ శాఖ అధికారులు, పంటల బీమా కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం రైతు సేవా కేంద్రాల సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి పంటల బీమాపై అన్నదాతలకు అవగాహన కల్పించే అంశంపై పలు సూచనలు చేశారు. తుఫాన్ అర్నబ్ ప్రభావంతో శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు తీవ్ర పంట నష్టం సంభవించిందని ముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పుడు మురసు తుఫాన్ ప్రభావంతో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఆయా ప్రాంతాల్లో పంట నష్టంపై త్వరితగతిన అంచనాలు రూపొందించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. విపత్తుల సమయంలో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రూ.25 వేల చొప్పున ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తోందని, దీనికి బీమా పరిహారం కూడా తోడైతే రైతులకు మరింత ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని సీఎం వివరించారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనతో పాటు ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలకు జరిగే నష్టాలకు బీమా సదుపాయం కల్పించినట్లు చంద్రబాబు తెలిపారు. బీమా క్లెయిమ్‌ల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిహారం పొందే విధానంపై రైతులకు వివరంగా చెప్పాలన్నారు. ఈ ఏడాది పెద్దఎత్తున పంటల బీమా చేయించామని, జిల్లా కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకుంటేనే వారికి పూర్తిస్థాయి ప్రయోజనాలు అందుతాయని పేర్కొన్నారు. పంటల బీమా రైతులకు అలవాటుగా మారాలని, అప్పుడే వైపరీత్యాలు సంభవించినప్పుడు ఆర్థికంగా నష్టపోకుండా ఉంటారన్నారు. అలాగే కౌలుదారులకు కూడా బీమా ప్రయోజనాలు అందేలా పక్కా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

పాలకమండలి స్థానంలో స్పెసిఫైడ్ అథారిటీ!

టీటీడీ కొత్త బోర్డు వచ్చే వరకూ ఈ అథారిటీదే బాధ్యత

చైర్మన్‌గా టిటిడి ఈవో ముద్దాడ రవిచంద్ర నియామకం

సభ్యులుగా అధికారులైన వినయ్ చంద్, కన్నబాబు

రెవెన్యూ శాఖ నుంచి అధికారిక జీవో జారీ



తిరుమల, నవంబర్ 2 (సమయం న్యూస్) : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి పదవీకాలం ముగియడంతో.. నూతన బోర్డు ఏర్పాటు అయ్యే వరకు పరిపాలనా బాధ్యతలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పెసిఫైడ్ అథారిటీని (ప్రత్యేక అధికారుల కమిటీ) నియమించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ జీవో నంబర్ 658 జారీ చేసింది. ముగ్గురు సభ్యులతో కూడిన ఈ కమిటీకి టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఆర్థిక శాఖ కార్యదర్శి వి. వినయ్ చంద్, రెవెన్యూ (ఎండోమెంట్స్) శాఖ కార్యదర్శి కె. కన్నబాబు సభ్యులుగా నియమితులయ్యారు.

కొత్త బోర్డు వచ్చేవరకు..

ఆంధ్రప్రదేశ్ చారిటబుల్ అండ్ హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్స్ చట్టంఉ1987లోని సెక్షన్ 137 ప్రకారం ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసింది. టీటీడీ ధర్మకర్తల మండలికి ఉండే అన్ని అధికారాలు, బాధ్యతలను ఈ ప్రత్యేక అధికారుల కమిటీ నిర్వహిస్తుంది. శ్రీవారి ఆలయ నిర్వహణ, భక్తులకు కల్పించే సౌకర్యాలు, పరిపాలనాపరమైన నిర్ణయాలను పర్యవేక్షిస్తుంది. నూతన పాలకమండలి ఏర్పాటు అయ్యే వరకు లేదా ఈ అథారిటీ నియామకం జరిగిన తేదీ నుంచి ఏడాది కాలం పూర్తయ్యే వరకు (ఏది ముందు అయితే అది) ఈ కమిటీ కొనసాగుతుంది. పాలకమండలి లేని సమయంలోనూ టీటీడీ పరిపాలన, భక్తులకు అందించే సేవలు నిరంతరాయంగా కొనసాగించడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశం.

గోపిక చికిత్సకు రూ.2 లక్షలు!

- మణిపాల్ ఆసుపత్రికి చెల్లింపులు
- రూ.లక్ష ఇచ్చిన మంత్రి సత్యకుమార్
- వైద్యులతో మాట్లాడుకుంటూ ప్రత్యేక శ్రద్ధ
- మెరుగుపడుతున్న బాలిక ఆరోగ్యం
- అనంతపురం, బెంగళూరు వైద్య బృందాలకు మంత్రి ప్రశంసలు



అమరావతి, నవంబర్ 2 (సమయం న్యూస్): అనంతపురం జిల్లా రాప్తాడులో దారుణ దాడికి గురై తీవ్రంగా గాయపడిన బాలిక గోపిక వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సాయంగా రూ.2 లక్షలు విడుదల చేసింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలతో సోమవారం ఈ మొత్తాన్ని అనంతపురం సర్వజన ఆసుపత్రి అభివృద్ధి నిధుల నుంచి బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రికి చెల్లించారు. దీనికి అదనంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ తన సొంత డబ్బు రూ.లక్షను బాధిత బాలిక కుటుంబానికి వ్యక్తిగత సాయంగా అందజేశారు. చిన్నారికి అత్యుత్తమ వైద్యం అందించేందుకు ఆయన స్వయంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో తొలుత అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన గోపికకు వైద్యులు తక్షణ చికిత్స అందించారు. ఎనిమిది ప్యాకెట్ల రక్తం ఎక్కించి, రక్తస్రావాన్ని నియంత్రించేందుకు అత్యవసర వైద్యం చేపట్టారు. అనంతరం మంత్రి చొరవతో మెరుగైన వైద్యం కోసం బాలికను బెంగళూరు మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులతో మంత్రి నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. సోమవారం డాక్టర్లు వెల్లడించిన వివరాల ప్రకారం గోపిక రక్తపోటు క్రమంగా అదుపులోకి వస్తోంది. మూత్ర విసర్జన వ్యవస్థ మెరుగుపడటంతో పాటు మూత్రపిండాల పనితీరు సాధారణ స్థాయికి చేరినట్లు రక్త పరీక్షల్లో తేలింది. మణిపాల్ ఆసుపత్రిలో గోపికకు చికిత్స అందిస్తున్న డాక్టర్ మయూర్ శెట్టి, డాక్టర్ లాల్‌చంద్, డాక్టర్ శిజ్జు, డాక్టర్ కౌశిక్, డాక్టర్ రవికిరణ్‌లతో మంత్రి సత్యకుమార్ మాట్లాడి వారి సేవలను అభినందించారు. అలాగే అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి, మత్తు వైద్య నిపుణులు డాక్టర్ హరికృష్ణ, మహేష్, సాంకేతిక నిపుణుడు గౌస్‌లను కూడా మంత్రి ప్రశంసించారు. వారి వేగవంతమైన స్పందన, సేవలను గుర్తిస్తూ వైద్య విద్య సంచాలకులు డాక్టర్ ఎ. విష్ణువర్ధన్ వారికి ప్రశంసా లేఖలు పంపించారు. బాలికకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం, వైద్య బృందాలు పక్కాగా శ్రద్ధ తీసుకుంటున్నాయి.

సీఎం రేవంత్‌కు షర్మిల ఆహ్వానం!

కుమార్తె వివాహ విందుకు రావాలని విజ్ఞప్తి



హైదరాబాద్, నవంబర్ 2 (సమయం న్యూస్) : ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తన కుమార్తె వివాహ విందు కార్యక్రమానికి ఆహ్వానించారు. వైఎస్ అంజలి రెడ్డి, అమెరికాలో స్థిరపడిన వైద్యుడు సోమల రఘురామ్ రెడ్డిల పెళ్లి విందు డిసెంబర్ 5న జరగనుంది. ఈ వేడుకకు సీఎం రేవంత్ రెడ్డి దంపతులతో పాటు వారి కుమార్తె నైమిషా విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని షర్మిల కోరారు. ఈ శుభకార్యానికి పెద్ద ఎత్తున పలువురు రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు.

భయపడలేదు.. వెనక్కి తగ్గలేదు!

స్నేహితురాలి కోసం ప్రాణాలకు తెగించిన లక్ష్మి

చైన్సాతో దాడి చేస్తున్నా వీడని ధైర్యం

రాప్తాడు ఘటనలో బాలిక సాహసానికి మంత్రి లోకేశ్ ఫిదా

ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ

అమరావతి, నవంబర్ 2 (సమయం న్యూస్) : అనంతపురం జిల్లా రాప్తాడు పాఠశాలలో జరిగిన దారుణ ఘటనలో ఓ విద్యార్థిని ప్రాణాపాయ స్థితికి చేరుకోగా.. ఆమెను కాపాడేందుకు తన స్నేహితురాలు లక్ష్మి ప్రాణాలకు తెగించి పోరాడిన తీరు రాష్ట్రవ్యాప్తంగా అందరినీ కదిలిస్తోంది. భయం గుప్పిట్లో పారిపోయే అవకాశం ఉన్నప్పటికీ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా దుండగుడిని ఎదిరించి నిలిచిన లక్ష్మి ధైర్యసాహసాలను మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆ బాలిక త్వరగా కోలుకోవాలని ప్రజలంతా ప్రార్థిస్తున్న వేళ.. ఈ ఇద్దరు చిన్నారుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

దుండగుడిని ఎదిరించి..

ఓ వ్యక్తి చైన్సాతో పాఠశాలలోకి ప్రవేశించిన సమయంలో లక్ష్మి భయంతో పారిపోకుండా, తన స్నేహితురాలిని కాపాడేందుకు ధైర్యంగా ముందుకు వెళ్లిందని లోకేశ్ తెలిపారు. తోటి విద్యార్థినికి రక్షణగా నిలిచే క్రమంలో లక్ష్మి కూడా తీవ్రంగా గాయపడిందని ఆయన పేర్కొన్నారు. తన ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఉన్నప్పటికీ స్నేహితురాలిని వదలకుండా అండగా నిలిచిందని ఆ బాలిక సాహసాన్ని ప్రశంసించారు. లక్ష్మి చూపిన తెగువ స్నేహానికి ఉన్న అసలైన విలువను చాటిచెప్పిందని అన్నారు.

అత్యుత్తమ వైద్యం అందిస్తాం..

ప్రస్తుతం ఆ ఇద్దరు బాలికలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, లక్ష్మికి సైతం మెరుగైన వైద్యం అందిస్తున్నారని మంత్రి తెలిపారు. రెండు కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి అండగా ఉంటామని, బాధిత బాలికలకు అత్యుత్తమ వైద్య సేవలు అందేలా కచ్చితమైన చర్యలు తీసుకుంటామని లోకేశ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని ఏ పాఠశాల తరగతి గదిలోనూ చిన్నారులు అభద్రతకు గురికాకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.



రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

- రాప్తాడు ఘటనే ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం
- బాధిత విద్యార్థినికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి
- లేదంటే మేం అధికారంలోకి రాగానే ఆదుకుంటాం
- వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించాలి
- బెంగళూరులో గోపికను పరామర్శించిన వైఎస్ జగన్



బెంగళూరు, నవంబర్ 2 (సమయం న్యూస్) : ఏపీలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, రాప్తాడు జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థిని గోపికపై జరిగిన దాడే ఇందుకు నిదర్శనమని మాజీ సీఎం, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. పాఠశాలల్లోకి ఆయుధాలతో బయటి వ్యక్తులు వస్తుంటే అడ్డుకునేవారు లేకపోవడం భద్రతా వైఫల్యాన్ని ఎత్తిచూపుతోందని మండిపడ్డారు. తరగతి గదిలోకి ప్రవేశించి విద్యార్థిని గొంతు కోసే పరిస్థితి రావడం అత్యంత దారుణమన్నారు. ఎలక్ట్రిక్ రంపంతో దాడికి గురై బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోపికను సోమవారం ఆయన పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి బాలిక ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి వద్ద మీడియాతో మాట్లాడారు.

రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి..

ప్రభుత్వ వైఫల్యంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించిన జగన్.. బాధిత బాలిక కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.50 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బాలికకు అవసరమైన అత్యుత్తమ వైద్య సేవలను ప్రభుత్వ ఖర్చుతో అందించాలని, కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం పరిహారం అందించకపోతే వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే రూ.50 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ఆయన ప్రకటించారు. బాలిక వైద్యానికి అవసరమైన సహాయ సహకారాలు కూడా పార్టీ తరఫున అందిస్తామని తెలిపారు.

రాప్తాడులో తొమ్మిది దారుణాలు..

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జగన్ ఆరోపించారు. రాప్తాడు నియోజకవర్గంలో గత పదిహేను నెలల కాలంలో తొమ్మిది దారుణ ఘటనలు చోటుచేసుకున్నాయని, వాటిలో ఆరు మహిళలు, బాలికలకు సంబంధించినవేనని ఆవేదన వ్యక్తం చేశారు. గోపికపై దాడితో పాటు అనూష, సావిత్రిబాయి, సావిత్రమ్మ ఘటనలు, 14 ఏళ్ల ఎస్సీ బాలికపై సామూహిక అత్యాచారం, కురువ లింగయ్య, బోయ నాగేష్, నారాయణరెడ్డి హత్యలు, స్పందన ఆత్మహత్య వంటి ఘటనలను ఆయన ప్రస్తావించారు. బెల్ట్ షాపులు, గంజాయి, మద్యం విచ్చలవిడిగా అందుబాటులోకి రావడంతో యువత వ్యసనాలకు బానిసలవుతున్నారని, వాటిని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పోలీసు వ్యవస్థను రాజకీయ వ్యవహారాలకు వినియోగించడం వల్లే శాంతిభద్రతలపై తగిన దృష్టి పడటం లేదని ఆరోపించారు.


కోలుకుంటున్న గోపిక..

దాదాపు 11 గంటల పాటు సాగిన క్లిష్టమైన శస్త్రచికిత్సను గోపిక తట్టుకోవడం సంతోషకరమని జగన్ అన్నారు. చికిత్సకు స్పందిస్తూ కోలుకుంటోందని వైద్యులు తెలిపినట్లు వెల్లడించారు. మరో 48 గంటల పాటు పరిస్థితిని నిశితంగా పరిశీలించాల్సి ఉంటుందని వైద్యులు చెప్పారన్నారు. బాలిక పూర్తిగా కోలుకుని క్షేమంగా ఇంటికి తిరిగి రావాలని ఆయన ఆకాంక్షించారు.

హెచ్‌పీసీఎల్‌లో అగ్నిప్రమాదం

- నూతన సల్ఫర్ ప్లాంట్‌లో మంటలు
- ట్రయల్ రన్ చేస్తుండగా అనూహ్య ఘటన
- ప్రాణనష్టం లేదన్న యాజమాన్యం

విశాఖపట్నం, నవంబర్ 2 (సమయం న్యూస్) : విశాఖపట్నంలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)లో చోటుచేసుకున్న భారీ అగ్నిప్రమాదం తీవ్ర కలకలం రేపింది. ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభంకాని నూతన సల్ఫర్ ప్లాంట్‌లో ట్రయల్ రన్ నిర్వహిస్తుండగా ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో పరిశ్రమలోని కార్మికులు, పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని యాజమాన్యం ప్రకటించడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. పక్కనే ఉన్న ఇతర పరిశ్రమల సహాయాన్ని కూడా తీసుకున్నారు. అగ్నిమాపక శాఖ, పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటూ హెచ్‌పీసీఎల్ యాజమాన్యం పరిస్థితిని చక్కదిద్దింది. గత రెండు గంటలుగా వివిధ శాఖల అధికారులతో సంప్రదింపులు జరుపుతూ సహాయక చర్యలను సమన్వయం చేసినట్లు సంస్థ ఒక ప్రాథమిక ప్రకటనలో వెల్లడించింది.



కారణాలపై ఆరా..

మంటలు అదుపులోకి రావడంతో ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు యాజమాన్యం పేర్కొంది. అయితే ఈ అగ్నిప్రమాదానికి దారితీసిన కచ్చితమైన కారణాలు, ప్లాంట్‌లో ఎంత మేర ఆస్తి నష్టం జరిగిందనే వివరాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. దీనిపై పూర్తి స్థాయి దర్యాప్తు తర్వాత అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

రిగ్గింగ్‌పై సమగ్ర విచారణ జరపాలి!

బూత్ క్యాప్చరింగ్, దొంగ ఓట్లపై ఈసీ స్పందించాలి
అక్రమాలు జరిగిన చోట రీ-పోలింగ్ నిర్వహించాలి
ప్రజాస్వామ్యాన్ని కూటమి సర్కారు అపహాస్యం చేసింది
సీఎం చంద్రబాబు తీరు సౌత్ బీహార్‌ను తలపించింది
ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు

విజయవాడ, నవంబర్ 2 (సమయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో నామినేషన్ల దశ నుంచి పోలింగ్ వరకు భారీగా రిగ్గింగ్ చోటుచేసుకుందని, దీనిపై తక్షణమే సమగ్ర విచారణ జరపాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇష్టారీతిన అక్రమాలకు పాల్పడుతూ కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని ఆమె తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. దొంగ ఓట్లు, బూత్ క్యాప్చరింగ్ జరిగిన ప్రాంతాల్లో తక్షణమే రీ-పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని ఆమె కోరారు.



గెలిచే సత్తా లేకే అక్రమాలు..

ప్రజల్లో మద్దతు లేక, సొంతంగా గెలిచే సత్తా లేకే బూత్ క్యాప్చరింగ్‌లు, దొంగ ఓట్ల ద్వారా గెలవాలని కూటమి పార్టీలు ప్రయత్నించాయని షర్మిల ఆరోపించారు. ఈ రిగ్గింగ్ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీరు సౌత్ బీహార్‌ను గుర్తుకు తెచ్చిందని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. ఒకపక్క ప్రజాస్వామ్యం, పారదర్శకత గురించి గొప్పలు చెబుతూనే.. మరోపక్క అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నికల వ్యవస్థను పూర్తిగా ప్రభావితం చేయడం ఏమిటని ఆమె ప్రశ్నించారు.

దాడులు.. దౌర్జన్యాలు..

విపక్ష అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడం, నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, ఓటు హక్కును వినియోగించుకోనీయకుండా అడ్డుపడటం ప్రజాస్వామ్యానికి పూర్తి విరుద్ధమని షర్మిల మండిపడ్డారు. రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కాకుండా దాడులు, దౌర్జన్యాల మధ్య అత్యంత భయానక వాతావరణంలో జరిగాయని ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘం తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆరు నెలల్లో పీఆర్సీ రిపోర్ట్ ఇవ్వాలి!

ఇప్పటికే 12వ వేతన సవరణ సంఘం నియామకంలో జాప్యం
పీఆర్సీ కమిషనర్‌కు ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర నాయకత్వం విజ్ఞప్తి

అమరావతి, నవంబర్ 2 (సమయం న్యూస్): రాష్ట్ర 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) నివేదికను ఆరు నెలల్లో ప్రభుత్వానికి సమర్పించాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర నాయకత్వం పీఆర్సీ కమిషనర్ దినేష్ కుమార్‌కు విజ్ఞప్తి చేసింది. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని నాలుగో బ్లాక్‌లో పీఆర్సీ కమిషనర్‌ను ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు సహా పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యోగుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 12వ పీఆర్సీ నియామకంలో ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగిందని, దీనివల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆర్థిక ప్రయోజనాలపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం కమిషన్‌కు ఏడాది గడువు ఇచ్చినప్పటికీ.. అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ విధానాలు, ఉద్యోగుల సమాచారాన్ని వినియోగించుకుని ఆరు నెలల్లోనే నివేదిక సిద్ధం చేయవచ్చని వారు తెలిపారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువులు, విద్య, వైద్యం, గృహ నిర్వహణ ఖర్చుల నేపథ్యంలో ప్రస్తుత వేతనాలతో కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత 11వ పీఆర్సీకి సంబంధించిన బకాయిలు ఇంకా పూర్తిగా చెల్లించకపోవడం ఉద్యోగుల ఆర్థిక పరిస్థితిని మరింత ప్రభావితం చేస్తోందన్నారు. 12వ పీఆర్సీ అమలులో జాప్యం జరిగితే 2022 నుంచి ప్రతి సంవత్సరం పదివేలకు పైగా పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులు, పెన్షనర్లకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని బొప్పరాజు, దామోదరరావు పేర్కొన్నారు. పీఆర్సీ అనేది కేవలం వేతనాల పెంపునకు సంబంధించిన అంశం మాత్రమే కాదని, ఉద్యోగుల ఆర్థిక భద్రత, కుటుంబ సంక్షేమం, ఆత్మగౌరవంతో ముడిపడి ఉందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ చైర్మన్ టి.వి. ఫణి పేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రతి ఓటూ కాపాడుకోవాలి!

కౌంటింగ్ కేంద్రాల్లో పూర్తి అప్రమత్తంగా ఉండాలి
అధికార పార్టీ అక్రమాలను ఎక్కడికక్కడ అడ్డుకోండి
5న జరిగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ పోరుకూ సిద్ధం కావాలి
వైఎస్సార్సీపీ నేతలకు సజ్జల రామకృష్ణారెడ్డి దిశానిర్దేశం

తాడేపల్లి, నవంబర్ 2 (సమయం న్యూస్) : స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపులో ప్రతి ఓటునూ కాపాడుకునేలా పార్టీ నాయకులు, ఏజెంట్లు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని వైఎస్సార్సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం జరిగే కౌంటింగ్‌లో అధికార పార్టీ అక్రమాలకు పాల్పడే అవకాశం ఉన్నందున అడుగడుగునా నిఘా పెట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలతో సజ్జల టెలికాన్ఫరెన్స్ నిర్వహించి కీలక అంశాలపై చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార టీడీపీ వ్యవహరిస్తున్న తీరుతో పాటు కౌంటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన నేతలను అప్రమత్తం చేశారు. దీనికి తోడు ఈ నెల 5న జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా ఏమాత్రం నిరుత్సాహపడకుండా, ప్రతి స్థానాన్ని కీలకంగా భావించి పోరాడాలని స్పష్టం చేశారు.



అధికార దుర్వినియోగం..

స్థానిక పోరులో నామినేషన్ల దశ నుంచే అధికార టీడీపీ ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగం చేస్తోందని సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. గతంలో అక్కడక్కడా కనిపించిన అధికార దుర్వినియోగం ఈసారి వ్యవస్థీకృతంగా జరుగుతోందని ఆరోపించారు. పోలీసు యంత్రాంగం, ఎన్నికల అధికారులు అధికార పార్టీకి పూర్తిగా అనుకూలంగా వ్యవహరించారని, కొన్ని చోట్ల వారంతా ఏకంగా టీడీపీ కార్యకర్తల్లా పనిచేశారని విమర్శించారు. నామినేషన్ల తిరస్కరణ, బలవంతపు ఉపసంహరణల నుంచి మొదలుపెడితే పోలింగ్ రోజు దొంగ ఓట్ల ప్రయత్నాల వరకు అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

డీప్‌ఫేక్‌పై ఉక్కుపాదం మోపండి!

ఏఐ దుర్వినియోగంతో సినీ ప్రముఖుల ప్రతిష్ఠకు భంగం
నటీమణులపై అసభ్యకర కంటెంట్ సృష్టిస్తున్న వైనం
కఠిన చట్టాలు తీసుకురావాలని అమిత్ షాకు చిరు విజ్ఞప్తి
పూర్తి వివరాలతో వినతిపత్రం ఇవ్వాలని సూచించిన కేంద్ర మంత్రి
సమన్వయ బాధ్యతలు కిషన్ రెడ్డికి అప్పగింపు



హైదరాబాద్, నవంబర్ 2 (సమయం న్యూస్) : కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ సినీ ప్రముఖుల ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇందుకు సంబంధించి పటిష్టమైన చట్టాలు తీసుకురావాలని మెగాస్టార్ చిరంజీవి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో చిరంజీవి, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సమావేశమై డీప్‌ఫేక్ కంటెంట్‌పై సుదీర్ఘంగా చర్చించారు. బీజేపీ మహా పాదయాత్రలో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన అమిత్ షాను బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమిత్ షాను చిరంజీవి శాలువాతో సత్కరించి ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు.

నటీమణులే లక్ష్యంగా..

ప్రస్తుతం డీప్‌ఫేక్, మార్ఫింగ్ వంటి సాంకేతిక పద్ధతులతో కొందరు ఉద్దేశపూర్వకంగా సినీ ప్రముఖుల ఫొటోలు, వీడియోలను మార్చి అభ్యంతరకరమైన కంటెంట్ సృష్టిస్తున్నారని అమిత్ షాకు చిరంజీవి వివరించారు. ముఖ్యంగా నటీమణులను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర దృశ్యాలు రూపొందించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి దారుణమైన చర్యల వల్ల కళాకారుల వ్యక్తిగత గౌరవం, ప్రతిష్ఠ దెబ్బతినడంతో పాటు వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టాలీవుడ్ మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న ఈ సమస్యకు అడ్డుకట్ట వేసేలా సమగ్ర చట్టపరమైన చర్యలు అవసరమని ఆయన హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

లిఖితపూర్వకంగా ఇవ్వండి..

ఈ భేటీలో చిరంజీవి వివరించిన అంశాలను అమిత్ షా ఎంతో శ్రద్ధగా విన్నారు. ఏఐ సాంకేతికతను ఉపయోగించి మహిళలు, కళాకారుల గౌరవానికి భంగం కలిగించే వారి ఆటకట్టించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కూడిన లిఖితపూర్వక వినతిపత్రం సమర్పించాలని చిరంజీవికి సూచించారు. తదుపరి సంబంధిత అంశాలపై సమన్వయం చేసుకునే బాధ్యతను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి అప్పగించారు. ఈ వ్యవహారంపై అమిత్ షా సానుకూలంగా స్పందించడం పట్ల చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. కేంద్రం ఈ సమస్యపై తక్షణ చర్యలు చేపడితే సినీ పరిశ్రమకు ఎంతో ఉపశమనం కలుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



ఆస్పత్రి తరహాలోనే కోర్టు సేవలు!

పేదలకు నిరంతరం ఉచితంగా న్యాయం దక్కాలి

సామాన్యులకు ఎల్లప్పుడూ అండగా నిలవాలి

ఆర్థిక ఇబ్బందులతో ఎవరూ న్యాయానికి దూరం కావొద్దు

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు

దేవ్‌ఘర్, నవంబర్ 2 (సమయం న్యూస్) : దేశంలోని పేదలు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందించిన తరహాలోనే 24 గంటలూ ఉచితంగా, సులభంగా న్యాయ సేవలు అందుబాటులో ఉండాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. న్యాయ వ్యవస్థ ఎల్లప్పుడూ సామాన్యులకు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. జార్ఖండ్‌లోని దేవ్‌ఘర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి న్యాయ సేవలు–సాధికారత సదస్సులో ఆయన ప్రసంగించారు. అణగారిన వర్గాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిరంతరం ఉచిత న్యాయ సాయం అందించేలా సంబంధిత వ్యవస్థలు పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

రోగికి వైద్యం అందించినట్లే..

తాలూకా, జిల్లా కోర్టుల నుంచి హైకోర్టులు, సుప్రీంకోర్టు వరకు న్యాయ వ్యవస్థలోని ప్రతి విభాగం పేద ప్రజల సమస్యలు, బాధలను అర్థం చేసుకోవాలని జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. ఆస్పత్రికి వచ్చిన రోగికి ఏమాత్రం ఆలస్యం చేయకుండా వైద్యం అందించినట్లే.. న్యాయం కోసం ఎదురుచూస్తున్న బాధితులకు కూడా సత్వర పరిష్కారం చూపాలని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు, సామాజిక పరిస్థితుల కారణంగా ఎవరూ న్యాయ సేవలకు దూరం కాకూడదని ఆయన గట్టిగా చెప్పారు.

హక్కులపై అవగాహన కల్పించాలి..

సమాజంలో చివరి వరుసలో ఉన్న వ్యక్తికి కూడా న్యాయ వ్యవస్థపై పూర్తి విశ్వాసం కలిగించేలా చర్యలు తీసుకోవాలని జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. ప్రజలకు వారి చట్టపరమైన హక్కులపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు.. అవసరమైనప్పుడు ఉచిత న్యాయ సహాయం అందించాలని అన్నారు. న్యాయ సేవా అధికార సంస్థలు మరింత సమర్థంగా పనిచేస్తూ బాధితులకు సకాలంలో న్యాయం అందించే దిశగా కృషి చేయాలని సీజేఐ పిలుపునిచ్చారు.

బేషరతుగా క్షమాపణలు చెప్పాల్సిందే!

అమెరికా పౌరుడిగా ఉండి నిరసనల్లో పాల్గొంటారా?

నటుడు ఇమ్రాన్ ఖాన్‌పై బాంబే హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

దేశం విడిచి వెళ్లాలన్న సర్కారు ఆదేశాలపై విచారణ

అఫిడవిట్ ఇస్తే సరిపోదు.. క్షమాపణ చెప్పాలని సూచన

ముంబై, నవంబర్ 2 (సమయం న్యూస్): బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ ఖాన్ వ్యవహారంపై బాంబే హైకోర్టు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. అమెరికా పౌరుడిగా ఉంటూ ఇక్కడ నిరసనల్లో పాల్గొనడంపై ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించిన నిరసనల్లో ఇమ్రాన్ పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఆయన దేశం విడిచి వెళ్లాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఇమ్రాన్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా.. ఇమ్రాన్ అమెరికా పౌరుడని, కేవలం ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డు మాత్రమే కలిగి ఉన్నారని ధర్మాసనం గుర్తుచేసింది. ఇక్కడ భారత పౌరుడిగా వ్యవహరించడానికి ఆయనకు ఏమాత్రం వీల్లేదని తేల్చిచెప్పింది. అమెరికా పౌరుడైన ఓ భారతీయుడు అక్కడ ఇలాంటి నిరసనల్లో పాల్గొంటే ఆ దేశం ఎలా స్పందిస్తుందో ఒకసారి ఆలోచించాలని కోర్టు చురకలంటించింది. ఈ నిరసనల్లో పాల్గొనడం వంటి చర్యలపై తన వైఖరిని తెలుపుతూ స్పష్టమైన హామీ ఇవ్వాలని ఇమ్రాన్ ఖాన్‌ను ఆదేశించింది. 42 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్ జీవితమంతా భారత్‌లోనే గడిపారని, అమెరికాలో జన్మించిన కారణంగానే అక్కడి పౌరసత్వం పొందారని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు వివరించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. నాలుగు దశాబ్దాలకు పైగా భారత్‌లో నివసించినప్పటికీ ఆయన భారత పౌరుడు కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొంది. చిన్నప్పటి నుంచి ఇక్కడే ఉన్నప్పుడు భారత పౌరసత్వం ఎందుకు తీసుకోలేదని సూటిగా ప్రశ్నించింది.



నెక్స్ట్ ఫ్లైట్ ఎక్కించేవాళ్లు..

ఈ వివాదంలో నిరసనల నిర్వాహకులతో తనకు ఎలాంటి సంబంధం లేదని, అవసరమైతే అఫిడవిట్ దాఖలు చేసేందుకు సిద్ధమని ఇమ్రాన్ ఖాన్ కోర్టుకు తెలిపారు. భారత్‌లోనే ఉండేందుకు అనుమతించాలని వేడుకున్నారు. అయితే, కేవలం అఫిడవిట్ సమర్పించడం మాత్రమే సరిపోదని, బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ధర్మాసనం సూచించింది. ఒకవేళ భారత పౌరుడు ఎవరైనా విదేశాల్లో ఇలాంటి చర్యలకు పాల్పడి ఉంటే.. తదుపరి విమానంలోనే వారిని స్వదేశానికి పంపించే పరిస్థితి ఉండేదని కోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది.

విదేశీ మద్దతుతోనే మోదీ ప్రధాని!

- **పటేల్ జయంతి రోజున మోదీ చేసిన వ్యాఖ్యలకు రాహుల్ కౌంటర్**
- **భారత ఆర్థిక వ్యవస్థ పూర్తిగా విదేశీయుల చేతుల్లోనే ఉందన్న విమర్శ**
- **దమ్ముంటే ఏ వేదిక మీదకైనా బహిరంగ చర్చకు రావాలని సవాల్**
- **ఎక్స్ వేదికగా ప్రధాని వ్యాఖ్యలపై స్పందించిన కాంగ్రెస్ అగ్రనేత**

న్యూఢిల్లీ, నవంబర్ 2 (సమయం న్యూస్): తన విదేశీ పర్యటనలపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన పరోక్ష విమర్శలకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఘాటుగా బదులిచ్చారు. దేశ ప్రజలతో అబద్ధాలు చెప్పడం మానుకోవాలని ఆయన ప్రధానికి సూచించారు. విదేశీ శక్తుల మద్దతుతోనే మోదీ ప్రధానమంత్రి అయ్యారని, ఇప్పటికీ వారి అండతోనే పదవిలో కొనసాగుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు ప్రధాని వ్యాఖ్యలపై సోమవారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. భారత ఆర్థిక వ్యవస్థ పూర్తిగా విదేశీయుల నియంత్రణలో ఉందని, వారి మద్దతుతోనే నడుస్తోందని రాహుల్ విమర్శించారు. విదేశీ సామాజిక మాధ్యమ సంస్థలు కూడా మోదీకి అండగా నిలుస్తున్నాయని ఆరోపించారు.

చర్చకు వస్తారా..

ఈ అంశాలపై బహిరంగ చర్చకు రావాలని ప్రధానిని రాహుల్ గాంధీ సవాల్ చేశారు. ఏ వేదికపైనైనా, ఎప్పుడైనా చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. మోదీకి ధైర్యం ఉంటే చర్చకు రావాలన్న ఆయన.. తనకు తెలిసిన విషయాలు బయటపడతాయనే భయంతోనే ప్రధాని బహిరంగ చర్చకు రావడం లేదని విమర్శించారు.

మోదీ ఏమన్నారంటే..

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో శనివారం జరిగిన జాతీయ సమైక్యత దినోత్సవంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ రాహుల్‌ను ఉద్దేశించి పరోక్ష విమర్శలు చేశారు. విదేశాల్లో రహస్యంగా కొందరిని కలుస్తున్నదెవరు? భారత్‌ను వ్యతిరేకించే శక్తుల మద్దతు ఎవరికి లభిస్తోంది? దేశ శత్రువుల భాషలో మాట్లాడుతున్నదెవరు? అంటూ ప్రశ్నలు సంధించారు. దేశాన్ని విభజించేందుకు కొన్ని శక్తులు నిరంతరం కుట్రలు చేస్తున్నాయని, వదంతులు వ్యాప్తి చేసేందుకు సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తున్నాయని ఆరోపించారు.



దశాబ్దానికి పైగా నిరాశ, నిస్పృహల్లో ఉన్న ఆ శక్తులు ఇప్పుడు బహిరంగంగా ముందుకొస్తున్నాయని వ్యాఖ్యానించారు. దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకునే ప్రయత్నాలను గుర్తించి ప్రజలంతా ఐక్యంగా ఎదుర్కోవాలని మోదీ పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలకు కౌంటర్‌గానే రాహుల్ గాంధీ స్పందించారు.

స్వచ్ఛ ఇంధనంతోనే ఆర్థిక భద్రత!

- **శిలాజ ఇంధనాలపై ఆధారపడితే ఆర్థిక వ్యవస్థలకు ముప్పే**
- **300 గిగావాట్లకు చేరువలో పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం**
- **2030 లక్ష్యాన్ని ఐదేళ్ల ముందే సాధించిన భారత్**
- **'సూర్య ఘర్'తో 65 లక్షల కుటుంబాలకు లబ్ధి**
- **భారత్ రెన్యువబుల్ ఎనర్జీ సదస్సులో ప్రధాని మోదీ**

న్యూఢిల్లీ, నవంబర్ 2 (సమయం న్యూస్): ప్రపంచవ్యాప్తంగా శిలాజ ఇంధనాలపై అధికంగా ఆధారపడటం ఆర్థిక వ్యవస్థలను సంక్షోభంలోకి నెడుతోందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇంధన భద్రతకు స్వచ్ఛ ఇంధన వనరులే కీలకమని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన 'భారత్ రెన్యువబుల్ ఎనర్జీ సమిట్ అండ్ ఎక్స్‌పో ఉ2026'ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిలాజ ఇంధన నిల్వలు కొన్ని ప్రాంతాలకే పరిమితమైతే.. సౌర, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక వనరులు అన్ని దేశాలకూ అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి ప్రాంతం తనకున్న సహజ వనరులను వినియోగించుకుని స్వచ్ఛ విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉందన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధిని సాధిస్తోందన్నారు.



గత పదేళ్లలో దేశీయ పెట్టుబడులను పెంచడంతో పాటు కీలక కార్యక్రమాలను అమలు చేయడం వల్ల అంతర్జాతీయ పరిణామాల ప్రభావం మనపై పడలేదన్నారు. జల, సౌర, పవన, అణు విద్యుత్‌తో పాటు గ్రీన్ హైడ్రోజన్ రంగంలోనూ భారత్ సామర్థ్యాన్ని పెంచుకుంటోందని ఆయన చెప్పారు.

ఐదేళ్ల ముందే లక్ష్యం సాధించాం..

పారిస్ ఒప్పందం ప్రకారం మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో 50 శాతానికి పైగా శిలాజేతర వనరుల వాటా ఉండాలన్న లక్ష్యాన్ని 2030 నాటికి సాధించాలని భారత్ తొలుత నిర్ణయించిందని మోదీ గుర్తుచేశారు. అయితే నిర్దేశిత గడువుకు ఐదేళ్ల ముందుగానే అంటే 2025లోనే ఆ మైలురాయిని చేరుకున్నామని వెల్లడించారు. ప్రస్తుతం దేశ విద్యుత్ సామర్థ్యంలో శిలాజేతర వనరుల వాటా 50 శాతానికి మించిందన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ఇప్పటికే దాదాపు 300 గిగావాట్ల స్థాయికి చేరుకున్నామని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే పదేళ్లలో అదనంగా మరో 500 గిగావాట్ల శిలాజేతర విద్యుత్ సామర్థ్యాన్ని సమకూర్చుకోవడం తమ తదుపరి లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

సౌర విద్యుత్‌తో భారీగా ఆదా..

గృహాలపై సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటును ప్రోత్సహించేందుకు 2024లో ప్రారంభించిన 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన' ద్వారా ఇప్పటివరకు 65 లక్షలకు పైగా కుటుంబాలకు ప్రయోజనం చేకూరిందని ప్రధాని మోదీ తెలిపారు. ఈ పథకం కింద కోటి కుటుంబాలకు లబ్ధి చేకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. సౌర విద్యుత్ వినియోగం వల్ల లబ్ధిదారుల బిల్లులు సగటున 76 శాతం మేర తగ్గాయని ఆయన వెల్లడించారు. పీఎం కుసుమ్ పథకం ద్వారా 30 లక్షలకు పైగా రైతులు సౌర విద్యుత్ ప్రయోజనం పొందుతున్నారని, దీని ద్వారా ఒక్కో రైతుకు ఏడాదికి సుమారు రూ.లక్ష వరకు ఆదా అవుతోందని చెప్పారు. అలాగే 44 వేలకు పైగా ప్రభుత్వ భవనాలపై ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ వ్యవస్థల ద్వారా ఏటా దాదాపు రూ.700 కోట్లు ఆదా అవుతున్నాయని ఆయన వివరించారు.

కాంగ్రెస్ అరాచకత్వాన్ని అంతం చేయాలి!

- **హైదరాబాద్ గడ్డపై సంకల్పం తీసుకుందాం..**
- **రాష్ట్రంలో బీజేపీని గెలిపించుకుందాం**
- **దేశవ్యాప్తంగా కాంగ్రెస్ వెంటిలేటర్‌పై ఉంది..**
- **చొరబాటుదారులకు ఓటు హక్కు దక్కనివ్వబోం**
- **బీజేపీ మహా పాదయాత్రలో కేంద్ర మంత్రి అమిత్ షా**



హైదరాబాద్, నవంబర్ 2 (సమయం న్యూస్) : ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకత్వాన్ని అంతం చేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సర్కార్‌ను గద్దె దించేందుకు హైదరాబాద్ గడ్డపై ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీని గెలిపించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా 'లోక్‌తంత్ర బచావో ఉ అరాచకత హఠావో' నినాదంతో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మహా పాదయాత్ర ఆయన నాయకత్వంలో అత్యంత ఉత్సాహంగా సాగింది. నిజాం కాలేజీ సమీపంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి మొజంజాహి మార్కెట్ క్రాస్ రోడ్స్ వరకు ఈ యాత్ర కొనసాగింది. పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా పాల్గొనడంతో హైదరాబాద్ వీధులన్నీ కాషాయమయంగా మారాయి. అడుగడుగునా జై బీజేపీ నినాదాలతో నగర వీధులు హోరెత్తాయి.

కాంగ్రెస్ వెంటిలేటర్‌పై ఉంది..

మహా పాదయాత్రలో ప్రజలకు అభివాదం చేస్తూ అమిత్ షా ముందుకు సాగారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. ఉక్కు మనిషి సర్దార్ వల్లభ భాయ్ పటేల్ లేకపోతే హైదరాబాద్ సంస్థానానికి విముక్తి లభించేది కాదని గుర్తుచేశారు. కాంగ్రెస్, ఇండి కూటమి చేపడుతున్న ర్యాలీలు ఓటు బచావో కోసం కాదని, చొరబాటుదారు(ఘుస్‌పైథియా)లను కాపాడేందుకేనని విమర్శించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్), ఓట్ల తొలగింపుపై రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో 13 కోట్ల ఓట్లు రద్దయ్యాయని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని.. అసలు తొలగించిన ఓట్లలో ఆరున్నర కోట్లు వేరే ప్రాంతాలకు మారిన వారివి కాగా, మరో మూడు కోట్ల మంది చనిపోయిన వారివి ఉన్నాయన్నారు. నకిలీ ఓట్లను తొలగిస్తుంటే రాహుల్ గాంధీకి ఎందుకు కడుపుమంట అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఎంత ప్రయత్నించినా చొరబాటుదారులకు ఓటు హక్కు దక్కనివ్వబోమని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ వెంటిలేటర్‌పై ఉందంటూ.. అలాంటి పార్టీ మోదీని అడ్డుకుంటుందా అని ఎద్దేవా చేశారు.

మాక్ పార్లమెంటులోనే ప్రధాని..

రాహుల్ గాంధీ ఎప్పటికీ దేశానికి ప్రధాని కాలేరని.. కేవలం మాక్ పార్లమెంటులోనే ప్రధాని కాగలరని అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'సర్' అమలులోకి రాకముందే కేంద్రంలో బీజేపీ వరుసగా మూడుసార్లు గెలిచిందని, మహారాష్ట్ర, హర్యానా, దిల్లీ, బీహార్, బెంగాల్, అస్సాం ఎన్నికల్లో ప్రజాదరణతోనే విజయం సాధించామన్నారు. ఓడిపోతే ఈవీఎంలపై నెపం వేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. ఈవీఎంల ద్వారానే బీజేపీ గెలిస్తే మరి తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచింది.. కేరళ, తమిళనాడులో బీజేపీయేతర ప్రభుత్వాలు ఎలా ఏర్పడ్డాయని ప్రశ్నించారు. ఈవీఎంలు, 'సర్' అంశాలపై చర్చకు తాము సిద్ధమంటూ.. పార్లమెంటులో చర్చకు రాకుండా కాంగ్రెస్ ఎందుకు పారిపోతోందో చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను దిల్లీ కాంగ్రెస్‌కు ఏటీఎంలా మార్చేసిందని.. రాష్ట్ర ప్రజల సొమ్ముతో నిస్సిగ్గుగా ఆర్ఆర్ (రాహుల్–రేవంత్) ట్యాక్స్ పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. మోదీ 12 ఏళ్ల పాలనలో ఒక్క అవినీతి మరక కూడా లేదన్నారు.

అమిత్ షాకు ఘన స్వాగతం..

తొలుత హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న అమిత్ షాకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన చార్మినార్ సమీపంలోని భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కేంద్ర ప్రభుత్వంపైనా, బీజేపీపైనా కాంగ్రెస్, ఇండి కూటమి పచ్చి అబద్ధాలతో విష ప్రచారం చేస్తున్నాయని రామచందర్ రావు మండిపడ్డారు. దుష్ప్రచారాలను ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, లక్ష్మణ్, డీకే అరుణ, ధర్మపురి అర్వింద్, గోడం నగేశ్, రఘునందన్ రావు పాల్గొన్నారు.

నషా ముక్త్ భారత్ అభియాన్

వ్యసనాలకు బానిసలు కావద్దు.. దేశ భవిష్యత్తుకు వారసులుగా ఎదగాలి!

యువత ఆరోగ్యమే జాతి సంపద.. మాదకద్రవ్య రహిత సమాజమే వికసిత్ భారత్‌కు పునాది



కైలాస్ నాగేష్

మహాకవి శ్రీశ్రీ చెప్పినట్లు "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్!" ప్రజల ఆరోగ్యం, ప్రతిభ, ఆత్మగౌరవమే దేశానికి నిజమైన సంపద. యువత వ్యసనాలకు బానిసలైతే వారి వ్యక్తిగత భవిష్యత్తుతో పాటు దేశ ప్రగతికి అవసరమైన మానవ వనరులు కూడా దెబ్బతింటాయి. అందుకే వ్యసనాల నివారణను కేవలం ఆరోగ్య సమస్యగా కాకుండా దేశ నిర్మాణంలో కీలకమైన బాధ్యతగా చూడాలి.

యువశక్తికి సంకెళ్లు వద్దు.. సృజనాత్మకతకు రెక్కలు తొడగాలి!

భారత యువతలో అపారమైన శక్తి, సృజనాత్మకత, ప్రతిభ ఉన్నాయి. ఆ సామర్థ్యాలను వ్యసనాల వైపు కాకుండా క్రీడలు, విద్య, కళలు, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, సామాజిక సేవ వంటి నిర్మాణాత్మక రంగాల వైపు మళ్లించాలి. యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించి, సానుకూల ఆలోచనలకు ప్రోత్సాహం అందించాలి. వారి శక్తి వ్యక్తిగత ఎదుగుదలతో పాటు దేశ ప్రగతికి దోహదపడేలా అవకాశాలు కల్పించాలి.

అవగాహనతో అడ్డుకట్ట.. ఆదరణతో పునరావాసం!

నషా ముక్త్ భారత్ అభియాన్ విజయానికి అవగాహన, ప్రజల భాగస్వామ్యం, పునరావాసం అనే మూడు అంశాలు కీలకం. మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలి. వ్యసనాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాలను యువతకు వివరించాలి. ఇప్పటికే వ్యసనాల బారిన పడినవారిని వివక్షతో చూడకుండా వైద్య చికిత్స, కౌన్సెలింగ్, పునరావాస సదుపాయాలు కల్పించాలి. వారు తిరిగి గౌరవప్రదమైన జీవితం ప్రారంభించేందుకు కుటుంబాలు, సమాజం అండగా నిలవాలి. వ్యసనం ఒక సమస్య అయినప్పటికీ, దాని నుంచి బయటపడేందుకు ప్రయత్నించే వ్యక్తికి మానవీయ ఆదరణ, సరైన చికిత్స అవసరం.

ఇంటి నుంచే మార్పు.. విద్యాసంస్థల నుంచి చైతన్యం!

వ్యసనాల నివారణలో కుటుంబం తొలి పాఠశాలగా, విద్యాసంస్థలు కీలక వేదికలుగా నిలవాలి. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారి ఆలోచనలు, సమస్యలను అర్థం చేసుకోవాలి. అవసరమైనప్పుడు మార్గదర్శకత్వం, కౌన్సెలింగ్ అందించాలి. విద్యాసంస్థలు పాఠ్యాంశాలతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవ ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించాలి.

మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారంపై సమాజమే ఉక్కుపాదం!

మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయి. వీటిని అరికట్టేందుకు చట్ట అమలు సంస్థలు కఠినంగా వ్యవహరించడంతో పాటు ప్రజలు కూడా బాధ్యతాయుతంగా సహకరించాలి. అనుమానాస్పద కార్యకలాపాల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేయాలి. అదే సమయంలో వ్యసన బాధితులను వెలివేయకుండా చికిత్స, పునరావాసం వైపు ప్రోత్సహించాలి. నివారణ, చట్ట అమలు, మానవీయ ఆదరణ సమాంతరంగా కొనసాగినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి.

> **మాదకద్రవ్యాల వ్యసనం నేడు ప్రజారోగ్యానికి, కుటుంబ వ్యవస్థకు, సమాజానికి తీవ్రమైన సవాలుగా మారింది. ఈ సమస్యను సమష్టిగా ఎదుర్కొనే లక్ష్యంతో భారత ప్రభుత్వం చేపట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వ్యసనాలను నివారించడం, బాధితులకు పునరావాసం కల్పించడం ద్వారా ఆరోగ్యవంతమైన, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. స్నేహితుల ఒత్తిడి, మానసిక ఆందోళనలు, కుతూహలం, సరైన అవగాహన లేకపోవడం వంటి కారణాలతో ముఖ్యంగా యువత వ్యసనాల బారిన పడుతున్నారు. ఫలితంగా వారి ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలు దెబ్బతినడమే కాకుండా కుటుంబాలు కూడా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వం, కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది.**

ఆరోగ్యవంతమైన యువత.. వికసిత్ భారత్‌కు బలమైన పునాది!

దేశ అభివృద్ధిని కేవలం ఆర్థిక ప్రగతితో కొలవలేం. ఆరోగ్యవంతమైన పౌరులు, బలమైన కుటుంబాలు, సాధికారత పొందిన యువత ఉన్నప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ఒక్క యువకుడిని వ్యసనం నుంచి బయటపడేయడం అంటే ఒక కుటుంబానికి భరోసా కల్పించడంతో పాటు దేశ భవిష్యత్తును కాపాడటమే. నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రభుత్వ కార్యక్రమంగా మాత్రమే మిగిలిపోకుండా ప్రతి ఇల్లు, విద్యాసంస్థ, సమాజం భాగస్వామ్యమయ్యే నిరంతర ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకోవాలి. యువత చేతుల్లో మాదకద్రవ్యాలు కాకుండా జ్ఞానం, నైపుణ్యం, సృజనాత్మకత, దేశ నిర్మాణ ఆశయాలు ఉండాలి. వ్యసనాలకు బానిసలు కావద్దు.. దేశ భవిష్యత్తుకు వారసులుగా ఎదగాలి! యువత సామర్థ్యాన్ని వ్యసనాలు నిర్వీర్యం చేయకుండా, వారి ప్రతిభ దేశ ప్రగతికి దోహదపడేలా మనమంతా కృషి చేద్దాం. నేటి యువతను కాపాడితేనే రేపటి భారతదేశానికి ఉజ్వల భవిష్యత్తును అందించగలం!

మాదకద్రవ్యాలకు నో..
ఆరోగ్యవంతమైన జీవితానికి యెస్!



చమురు ధరల భారీ పతనం!

4 శాతానికి పైగా తగ్గిన క్రూడాయిల్ రేట్లు

అమెరికా-ఇరాన్ దౌత్య చర్చల ప్రభావం

బ్యారెల్‌కు 4.20 డాలర్లు తగ్గిన బ్రెంట్ ముడి చమురు

99.61 డాలర్లకు చేరిన డబ్ల్యూటీఐ ధర

లండన్, నవంబర్ 2 (సమయం న్యూస్) : అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా తగ్గాయి. అమెరికాఇరాన్ మధ్య దౌత్య చర్చల్లో పురోగతి వస్తుందన్న ఆశలతో సోమవారం చమురు ధరలు 4 శాతానికి పైగా పడిపోయాయి. బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 4.20 డాలర్లు తగ్గి 108.68 డాలర్ల స్థాయికి చేరగా.. అమెరికా డబ్ల్యూటీఐ ముడి చమురు ధర 4.3 శాతం తగ్గి 99.61 డాలర్లకు చేరింది.

జీఎస్టీ వసూళ్ల సరికొత్త రికార్డు!

అక్టోబర్‌లో భారీగా పెరిగిన పన్ను ఆదాయం

ఏకంగా రూ.2.31 లక్షల కోట్లకు చేరిన వసూళ్లు

గత ఏడాదితో పోలిస్తే 22.9 శాతం వృద్ధి

కేంద్ర ప్రభుత్వ ఆదాయానికి మరింత బలం



న్యూఢిల్లీ, నవంబర్ 2 (సమయం న్యూస్) : దేశంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు అక్టోబర్ నెలలో గణనీయంగా పెరిగాయి. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 22.9 శాతం వృద్ధి నమోదై మొత్తం జీఎస్టీ వసూళ్లు రూ. 2.31 లక్షల కోట్లకు చేరుకున్నాయి. దేశంలో ఆర్థిక కార్యకలాపాలు, వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో జీఎస్టీ ఆదాయం భారీగా పెరిగినట్లు తెలుస్తోంది. పన్ను వసూళ్లలో నమోదైన ఈ వృద్ధి కేంద్ర ప్రభుత్వ ఆదాయానికి మరింత బలాన్ని చేకూర్చనుంది.

రైల్వే ఆస్తుల రక్షణకు సమన్వయం!

- **భద్రతా నిబంధనల అమలులో అప్రమత్తంగా ఉండాలి**
- **గడువులోగా మౌలిక వసతుల పనులు పూర్తి చేయాలి**
- **రైలు కార్యకలాపాల భద్రతపై జీఎం ఉన్నతస్థాయి సమీక్ష**
- **సికింద్రాబాద్ రైల్ నిలయంలో వీడియో కాన్ఫరెన్స్**



సికింద్రాబాద్, నవంబర్ 2 (సమయం న్యూస్): రైల్వే ఆస్తులు, భూగర్భ విద్యుత్, సమాచార కేబుళ్ల పరిరక్షణకు వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సూచించారు. సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల భద్రతపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మూడు డివిజన్ల రైల్వే మేనేజర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. గేట్‌మెన్లు, క్షేత్రస్థాయి సిబ్బందికి నిరంతరం భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, విధుల్లో అప్రమత్తంగా ఉండాలని జీఎం ఆదేశించారు. అనధికార ప్రవేశాల నివారణకు చేపడుతున్న కంచెల నిర్మాణం, యార్డుల ఆధునికీకరణ పనుల పురోగతిని సమీక్షించారు. రైలు కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంచే అన్ని మౌలిక వసతుల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

మొక్కజొన్న ఉత్పత్తి 75 మిలియన్ టన్నులకు చేరాలి!

- **పదేళ్లలో దేశంలో దిగుబడి 1.5 రెట్లు పెంచడమే లక్ష్యం**
- **కొత్త వంగడాలు, ఆధునిక సాగు పద్ధతులకు ప్రాధాన్యం**
- **ఐసీఏఆర్ డీజీ డాక్టర్ ఎం.ఎల్. జాట్ పిలుపు**
- **హైదరాబాద్‌లో అంతర్జాతీయ మొక్కజొన్న సదస్సు**



హైదరాబాద్, నవంబర్ 2 (సమయం న్యూస్) : దేశంలో మొక్కజొన్న ఉత్పత్తిని ప్రస్తుత 55 మిలియన్ టన్నుల నుంచి పదేళ్లలో 75 మిలియన్ టన్నులకు పెంచాలని ఐసీఏఆర్ డీజీ డాక్టర్ ఎం.ఎల్. జాట్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో నవంబర్ 2 నుంచి 4 వరకు జరుగుతున్న తొలి అంతర్జాతీయ మొక్కజొన్న సదస్సులో ఆయన మాట్లాడారు. పదేళ్లలో దేశంలో దిగుబడిని 1.5 రెట్లు పెంచాలన్నారు. అధిక దిగుబడినిచ్చే కొత్త వంగడాలు, నాణ్యమైన విత్తనాలు, ఆధునిక సాగు పద్ధతులతో పాటు రైతు కేంద్రిత పరిశోధనలకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

ఉదయం 6 గంటలకే కేంద్రాలకు చేరాలి!

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సిబ్బందికి కలెక్టర్ ఆదేశం

నవంబర్ 4న సామగ్రి పంపిణీ కేంద్రాల్లో రిపోర్ట్ చేయాలి

ఎన్నికల విధుల్లో ఎక్కడా నిర్లక్ష్యం వహించొద్దు

ఏర్పాట్లపై పుట్టపర్తిలో అధికారుల సమీక్ష

పుట్టపర్తి, నవంబర్ 2 (సమయం న్యూస్) : జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల విధుల్లో నియమితులైన ప్రిసైడింగ్ అధికారులు (పీవోలు), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవోలు), ఇతర పోలింగ్ అధికారులు నవంబర్ 4వ తేదీ ఉదయం 6 గంటలకల్లా సంబంధిత మండలాల ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం ఎన్నికల నిర్వహణపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ.. నవంబర్ 5న జరగనున్న పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల విధులను ఎలాంటి లోపాలు లేకుండా బాధ్యతాయుతంగా నిర్వహించాలని అధికారులకు, సిబ్బందికి స్పష్టం చేశారు.

ఐటీఐల రూపురేఖలు మార్చేలా పీఎం-సేతు!

ఈశాన్య రాష్ట్రాల్లో ఐటీఐల ఆధునీకరణకు కేంద్రం నిర్ణయం

పర్యాటక, ఆతిథ్య రంగాల్లో యువతకు ఉపాధి అవకాశాలు

అసోం ప్రభుత్వంతో కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ ఒప్పందం

జోర్హాట్, తిన్సుకియా క్లస్టర్ల అభివృద్ధికి శ్రీకారం

గువాహటి, నవంబర్ 2 (సమయం న్యూస్) : ఈశాన్య రాష్ట్రాల యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం-సేతు పథకం కింద ఐటీఐలను ఆధునీకరించనుంది. ఇందులో భాగంగా అసోం ప్రభుత్వంతో కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. జోర్హాట్, తిన్సుకియా ఐటీఐ క్లస్టర్ల అభివృద్ధికి నుమాలిగఢ్ రిఫైనరీ, ఆయిల్ ఇండియా సంస్థలు సహకరించనున్నాయి. పర్యాటక, ఆతిథ్య రంగాల్లో యువతకు దేశీయంగా, అంతర్జాతీయంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యమని కేంద్ర మంత్రి జయంత్ చౌదరి తెలిపారు.

ఇంధన భవిష్యత్తుకు గ్రీన్ హైడ్రోజన్ అత్యంత కీలకం!

2030 నాటికి ఏటా 50 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం

అంతర్జాతీయ భాగస్వామ్యానికి భారత్ అత్యధిక ప్రాధాన్యం

న్యూఢిల్లీలో పునరుత్పాదక ఇంధన సదస్సు ప్రారంభం

రూ.19,744 కోట్లతో జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్

న్యూఢిల్లీ, నవంబర్ 2 (సమయం న్యూస్) : భారత్ స్వచ్ఛ ఇంధన రంగంలో గ్రీన్ హైడ్రోజన్‌ను కీలక శక్తిగా అభివృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగా నవంబర్ 2 నుంచి 5వ తేదీ వరకు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో భారత్ పునరుత్పాదక ఇంధన సదస్సు, ప్రదర్శనఉ2026 నిర్వహిస్తున్నారు. 130కి పైగా దేశాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. 2023 జనవరిలో రూ.19,744 కోట్లతో ప్రారంభించిన జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ద్వారా 2030 నాటికి ఏటా 50 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

అన్నదాతకు డబుల్ లాభం.. అగ్రి-వోల్టాయిక్స్ విధానం!

ఒకే భూమిలో పంటల సాగు, సౌర విద్యుత్ ఉత్పత్తి

రైతులకు అదనపు ఆదాయం, నీటి ఆదాతో పాటు పర్యావరణ పరిరక్షణ

దేశవ్యాప్తంగా 36 ప్రాజెక్టులు.. 37.54 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి

వినూత్న విధానానికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం

న్యూఢిల్లీ, నవంబర్ 2 (సమయం న్యూస్) : వ్యవసాయంతో పాటు సౌర విద్యుత్ ఉత్పత్తి చేపట్టి రైతులకు అదనపు ఆదాయం కల్పించే వినూత్న విధానానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. వ్యవసాయ భూముల్లోనే సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేసి, వాటి కింద పంటలు సాగు చేసే విధానాన్ని 'అగ్రి-వోల్టాయిక్స్'గా పిలుస్తారు. ఈ విధానం ద్వారా ఒకే భూమిలో పంటల సాగుతో పాటు విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చు. సౌర విద్యుత్ పలకల వల్ల పంటలకు పాక్షికంగా నీడ లభించడంతో అధిక ఉష్ణోగ్రతల ప్రభావం తగ్గి, నేలలో తేమ ఆవిరి కావడం కూడా తగ్గుతుంది. సాగునీటి పంపుల నిర్వహణకు అవసరమైన విద్యుత్‌ను వినియోగించుకోవడంతో పాటు మిగులు విద్యుత్‌ను సంస్థలకు విక్రయించి రైతులు అదనపు ఆదాయం పొందవచ్చు. దేశంలో ప్రస్తుతం ఇలాంటి 36 ప్రాజెక్టుల ద్వారా 37.54 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం అందుబాటులో ఉంది.

ఆ పెళ్లి చెల్లదు!

వధూవరులు ఇద్దరూ ముస్లింలైతేనే నికాహ్

ఒకరు వేరే మతస్తులైతే ఆ ఆచారాలు అంగీకరించవు

ఒమర్ వివాహంపై అఖిల భారత ముస్లిం జమాత్ కుండబద్దలు

జమ్ము, నవంబర్ 2 (సమయం న్యూస్) : జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ప్రముఖ పాత్రికేయురాలు నిధి రజ్దాన్ వివాహం చుట్టూ ఇప్పుడు కొత్తగా మతపరమైన చర్చ మొదలైంది. ఇస్లాం మత నియమాల ప్రకారం వీరిద్దరి పెళ్లి చెల్లుబాటు కాదని అఖిల భారత ముస్లిం జమాత్ అధ్యక్షుడు మౌలానా ముఫ్తీ షహబుద్దీన్ రజ్వీ బరేల్వీ సంచలన వ్యాఖ్యలు చేశారు. షరియా నిబంధనల ప్రకారం నికాహ్ జరగాలంటే వధూవరులు ఇద్దరూ కచ్చితంగా ముస్లింలై ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఒమర్ అబ్దుల్లా ముస్లిం అయినప్పటికీ, నిధి రజ్దాన్ ముస్లిం కానందున ఈ వివాహాన్ని ఇస్లాం సంప్రదాయాల ప్రకారం ఏమాత్రం ఆమోదించలేమని ఆయన కుండబద్దలు కొట్టారు.

నిధి రజ్దాన్ వివాహానికి ముందు ఇస్లాం మతంలోకి మారి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని మౌలానా రజ్వీ అభిప్రాయపడ్డారు. మత మార్పిడి అనంతరం ఇస్లాం ఆచారాలు, సంప్రదాయాల ప్రకారం నికాహ్ నిర్వహించి ఉంటే అప్పుడు షరియా నిబంధనలకు అనుగుణంగా ఉండేదని ఆయన పేర్కొన్నారు. వివాహానికి సంబంధించి ఇస్లాంలో నిర్దిష్టమైన నియమాలు, షరతులు ఉన్నాయని వివరించారు. దంపతుల్లో ఒకరు ముస్లిం కాకపోతే ఆ వివాహాన్ని మతపరంగా చెల్లుబాటైనదిగా అస్సలు పరిగణించలేమని చెబుతూ.. ఒమర్, నిధి వివాహాన్ని ఆయన 'నాజాయిజ్'గా అభివర్ణించారు.

ఢిల్లీలో టపాసులకు సుప్రీం పచ్చజెండా!

- పర్యావరణహిత బాణాసంచాకే అవకాశం
- నవంబర్ 7, 8 తేదీల్లో మాత్రమే అనుమతి
- ఉదయం, రాత్రి వేళల్లో నిర్ణీత సమయాల్లోనే..
- ఆస్పత్రులు, నిశ్శబ్ద ప్రాంతాల వద్ద కాల్చడంపై నిషేధం



న్యూఢిల్లీ, నవంబర్ 2 (సమయం న్యూస్) : దీపావళి పండుగ సందర్భంగా ఢిల్లీతో పాటు దాని పరిసర ప్రాంతాల్లో పర్యావరణానికి హాని చేయని హరిత బాణాసంచా కాల్చుకునేందుకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. కేవలం నవంబర్ 7, 8 తేదీల్లో మాత్రమే ఈ టపాసులు పేల్చుకోవాలని స్పష్టం చేసింది. ఆ రెండు రోజుల్లో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు.. ఆ తర్వాత రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మాత్రమే బాణాసంచా కాల్చేందుకు అవకాశం కల్పించింది. ఆస్పత్రులు, వృద్ధాశ్రమాలతో పాటు నిశ్శబ్ద ప్రాంతాలుగా ప్రకటించిన ఇతర చోట్ల 300 మీటర్ల పరిధిలో ఎలాంటి టపాసులు అస్సలు పేల్చకూడదని ఉన్నత న్యాయస్థానం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

బంగ్లాదేశ్‌లో భగ్గుమన్న కార్మికులు!

- వస్త్ర పరిశ్రమల వద్ద హింసాత్మకంగా మారిన ఆందోళనలు
- మూడో రోజుకు చేరిన నిరసనలు.. కర్మాగారాలకు నిప్పు
- రోడ్డెక్కిన సుమారు పది లక్షల మంది పనులు బంద్
- కనీస వేతనం 30 వేల టాకాలకు పెంచాలని పట్టు
- దీనివెనుక అవామీ లీగ్ కుట్ర ఉందన్న అధికార వర్గాలు




ఢాకా, నవంబర్ 2 (సమయం న్యూస్) : బంగ్లాదేశ్‌లో వస్త్ర తయారీ రంగ కార్మికుల ఆందోళనలు తీవ్ర హింసాత్మకంగా మారాయి. కనీస వేతనాలు పెంచాలని కోరుతూ అక్టోబర్ 31న ప్రారంభమైన నిరసనలు మూడో రోజు మరింత తీవ్రరూపం దాల్చాయి. గజీపూర్, మీర్‌పూర్, సవార్ తదితర ప్రాంతాల్లో కార్మికులు జాతీయ రహదారులను పూర్తిగా దిగ్బంధించారు. పోలీసులతో పెద్దఎత్తున ఘర్షణలకు దిగడంతో పాటు పలు వాహనాలు, వస్తువుల గిడ్డంగులు, కర్మాగారాలకు నిప్పంటించారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు లాఠీచార్జి చేసి, బాష్పవాయువు, జల ఫిరంగులు ప్రయోగించారు. ఈ తాజా ఆందోళనల కారణంగా బంగ్లాదేశ్ వ్యాప్తంగా వందలాది పరిశ్రమలు మూతపడగా.. సుమారు పది లక్షల మంది కార్మికులు తమ విధులకు దూరమయ్యారు.

వేతనాలు పెంచాల్సిందే..

ప్రస్తుతం నెలకు 12,500 టాకాలుగా ఉన్న కనీస వేతనాన్ని ఏకంగా 30 వేల టాకాలకు పెంచాలని కార్మికులు గట్టిగా పట్టుబడుతున్నారు. దేశంలో పెరిగిన ఆహార ఖర్చులు, ఇళ్ల అద్దెలు, రవాణా చార్జీలతో ప్రస్తుత వేతనాలు కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదంతా హసీనా కుట్ర..

అయితే ఈ ఆందోళనల వెనుక పెద్ద రాజకీయ కుట్ర దాగి ఉందని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. మాజీ ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ కార్యకర్తలు వస్త్ర పరిశ్రమను దెబ్బతీసేందుకు ఈ నిరసనలను ఉద్దేశపూర్వకంగా ప్రేరేపిస్తున్నారని అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఛాత్ర లీగ్ కార్యకర్తలు కార్మికుల ముసుగులో ఈ ఆందోళనల్లో పాల్గొంటున్నారని అధికార వర్గాలు ఆరోపించాయి. కనీస వేతనాల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఆరుగురు సభ్యులతో ప్రత్యేక వేతన మండలిని ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. కోరికల సాధన కోసం కార్మికుల నిరసనలు ఏమాత్రం ఆగడం లేదు.



రష్యా రణరంగంలో తెలుగు యువకులు!

ఉద్యోగాల పేరుతో తీసుకెళ్లి భారీ దగా

ఆహార పాట్లాలు కట్టే పనులని నమ్మించిన దళారి

ప్రాణ భయంతో తమ ఆవేదనను రికార్డు చేసిన బాధితులు

స్వదేశానికి తీసుకురావాలని ప్రభుత్వాలకు వేడుకోలు

విశాఖపట్నం, నవంబర్ 2 (సమయం న్యూస్) : ఉపాధి కోసం రష్యా వెళ్లిన ఐదుగురు తెలుగు యువకులు అక్కడి యుద్ధక్షేత్రంలో చిక్కుకుని ప్రాణభయంతో కాలం వెళ్లదీస్తున్నారు. వీరిలో విశాఖపట్నానికి చెందిన ఇద్దరు యువకులు ఉన్నారు. రష్యా సైన్యంలో ఆహార పొట్లాలు కట్టే ఉద్యోగాలు ఇప్పిస్తామని నేపాల్‌కు చెందిన ఓ దళారి నమ్మించి తీసుకెళ్లినట్లు బాధితులు చెబుతున్నారు. అక్కడికి చేరుకున్నాక నకిలీ ఒప్పందాలతో మోసం చేసి, రష్యా-ఉక్రెయిన్ సరిహద్దులోని యుద్ధ ప్రాంతానికి బలవంతంగా పంపించారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని..

యుద్ధ క్షేత్రంలో చిక్కుకున్న యువకులు తాజాగా తమకు తాముగా రికార్డు చేసిన వీడియోలో తమ దీనస్థితిని వివరించారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో బతుకుతున్నామని, తమకు ఇదే చివరి రోజు కావచ్చని కన్నీటి పర్యంతమయ్యారు. బాంబుల పేలుళ్లు, తుపాకుల మోతల మధ్య ప్రతి క్షణం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నామని వాపోయారు. అక్కడి నుంచి సురక్షితంగా బయటపడతామో లేదో కూడా తెలియడం లేదని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

కాపాడాలని వేడుకోలు..

ఉద్యోగాల పేరుతో తమను మోసగించి దారుణంగా యుద్ధంలోకి నెట్టేశారని, వెంటనే స్పందించి కాపాడాలని భారత ప్రభుత్వాన్ని బాధితులు వేడుకుంటున్నారు. విదేశాంగ శాఖ అధికారులు దౌత్యపరమైన చర్యలు చేపట్టి తమను స్వదేశానికి చేర్చాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నానికి చెందిన యువకుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. తమ పిల్లలను క్షేమంగా వెనక్కి తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వారు కోరుతున్నారు.

మాదకద్రవ్యాల కేసులో ఇరికించే కుట్ర!

శివసేన నేత ఇంట్లో పరుపు కింద మత్తుపదార్థం ఉంచిన వైనం

గుప్త కెమెరాలో రికార్డైన పోలీసు అధికారి బాగోతం

నేత అరెస్టు తర్వాత వెలుగులోకి వచ్చిన దృశ్యాలు

ఏఎస్ఐ సుఖ్‌దేవ్ సింగ్ సస్పెన్షన్.. విచారణకు ప్రత్యేక బృందం

చండీగఢ్, నవంబర్ 2 (సమయం న్యూస్) : పంజాబ్‌లోని ఖన్నాలో ఓ శివసేన నాయకుడిని మాదకద్రవ్యాల కేసులో ఇరికించేందుకు జరిగిన ప్రయత్నం తీవ్ర కలకలం రేపుతోంది. మహంత్ కశ్మీర్ గిరి ఇంట్లోని పరుపు కింద మత్తుపదార్థం పెట్టినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏఎస్ఐ సుఖ్‌దేవ్ సింగ్ బాగోతం గుప్త కెమెరా దృశ్యాలతో వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన ఖన్నా ఎస్ఎస్పీ డాక్టర్ దర్పణ్ అహ్లువాలియా సదరు ఏఎస్ఐని విధుల నుంచి సస్పెండ్ చేశారు. విచారణ కోసం ఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో ఓ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. వాస్తవాలు వెలుగులోకి రావడంతో ఈ కేసులో అరెస్టయిన మహంత్ కశ్మీర్ గిరిని పోలీసులు విడుదల చేశారు.

డ్రైవర్ అరెస్టుతో మొదలై..

ఖన్నాలోని ఖతీకా చౌక్ సమీపంలో నివసించే మహంత్ కశ్మీర్ గిరి డ్రైవర్ గుర్జంట్ సింగ్ జంటాను తొలుత ఏడున్నర గ్రాముల హెరాయిన్‌తో పట్టుకున్నట్లు పోలీసులు ప్రకటించారు. అతడిని విచారించిన తర్వాత కశ్మీర్ గిరి పేరు బయటకు వచ్చిందని, ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించగా పరుపు కింద సుమారు 30 గ్రాముల మేర మత్తుపదార్థం లభించిందని వెల్లడించారు. దీంతో వెంటనే ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అయితే ఇంట్లోని గుప్త కెమెరాలో నమోదైన దృశ్యాలు ఈ కేసులో అత్యంత కీలకంగా మారాయి. పోలీసు బృందం రాకముందే సీఐఏ విభాగంలో పనిచేస్తున్న ఏఎస్ఐ సుఖ్‌దేవ్ సింగ్ సాధారణ దుస్తుల్లో ఇంట్లోకి వెళ్లినట్లు ఆ దృశ్యాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. గదిలోకి వెళ్లిన ఆయన పరుపు కింద ఏదో వస్తువు ఉంచినట్లు అందులో రికార్డైంది. ఆ తర్వాతే పోలీసులు అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించి హెరాయిన్ స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు.

పోలీసుల తీరుపై అనుమానాలు..

ఈ దృశ్యాలు బయటకు రావడంతో పోలీసుల సోదాల తీరుపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ పరిణామాన్ని తీవ్రంగా పరిగణించిన ఎస్ఎస్పీ డాక్టర్ దర్పణ్ అహ్లువాలియా ఏఎస్ఐ సుఖ్‌దేవ్ సింగ్‌ను విధుల నుంచి తప్పించారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలను నిష్పక్షపాతంగా తేల్చేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించారు. విచారణలో వెల్లడయ్యే అంశాల ఆధారంగా తదుపరి కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.



దిగ్గజ జట్లకు షాక్..

వన్డే ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ సంచలనం

- ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి చేరిన ఆఫ్ఘనిస్థాన్
- తమ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ర్యాంకును నమోదు
- శ్రీలంక, ఇంగ్లండ్, వెస్టిండీస్ వంటి జట్లను వెనక్కి నెట్టిన వైనం
- వన్డే, టీ20 ప్రపంచకప్‌లలో అద్భుత ప్రదర్శనలతో సత్తా చాటిన ఆఫ్ఘన్
- ఇటీవల ఐర్లాండ్, జింబాబ్వే సిరీస్‌లలో క్లీన్‌స్వీప్‌లతో జోరు



అంతర్జాతీయ క్రికెట్‌లో ఆఫ్ఘనిస్థాన్ తన ప్రస్థానంలో మరో చారిత్రక మైలురాయిని అందుకుంది. ఐసీసీ తాజాగా ప్రకటించిన పురుషుల వన్డే ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి ఎగబాకింది. మాజీ ప్రపంచ ఛాంపియన్ శ్రీలంకను వెనక్కి నెట్టి, తమ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ర్యాంకును నమోదు చేసింది. ఈ ఘనతతో ఆఫ్ఘనిస్థాన్.. ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్ వంటి బలమైన జట్ల కంటే మెరుగైన స్థానంలో నిలిచింది. 2009లో అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఆఫ్ఘన్ జట్టు, అనతికాలంలోనే అద్భుతమైన ప్రగతి సాధించింది. ఇప్పటివరకు 191 వన్డేలు ఆడిన ఆ జట్టు 96 మ్యాచ్ లలో విజయం సాధించి, బలమైన జట్టుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ముఖ్యంగా ప్రధాన టోర్నమెంట్లలో ఆఫ్ఘన్ ప్రదర్శన ప్రపంచాన్ని ఆకట్టుకుంది. భారత్ వేదికగా జరిగిన 2023 ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్, శ్రీలంక వంటి జట్లపై చారిత్రక విజయాలు నమోదు చేసి సంచలనం సృష్టించింది. అలాగే, ఈ ఏడాది జరిగిన టీ20 ప్రపంచకప్‌లో తొలిసారి సెమీఫైనల్స్‌కు చేరి తమ సత్తా చాటింది. ఇటీవల కాలంలో సాధించిన వరుస విజయాలు ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘన్ స్థానాన్ని మరింత మెరుగుపరిచాయి. ఐర్లాండ్ పర్యటనలో ఆతిథ్య జట్టును 4-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. ఆ తర్వాత జింబాబ్వే, బంగ్లాదేశ్‌లతో జరిగిన ట్రై-సిరీస్‌లో ఒక్క ఓటమి కూడా లేకుండా అజేయంగా నిలిచింది. వన్డేలతో పాటు టీ20 ఫార్మాట్‌లోనూ ఆఫ్ఘన్ జోరు కొనసాగుతోంది. తాజాగా షార్జాలో జింబాబ్వేతో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3-0 తేడాతో కైవసం చేసుకుంది. చివరి మ్యాచ్‌లో జింబాబ్వేను కేవలం 79 పరుగులకే ఆలౌట్ చేసింది. ఈ మ్యాచ్‌లో లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ నూర్ అహ్మద్ 13 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. ఈ సిరీస్‌లోని రెండో టీ20లో అజ్మతుల్లా ఒమర్జాయ్ కేవలం 50 బంతుల్లో 116 పరుగులు చేయగా, తొలి మ్యాచ్‌లో కెప్టెన్ రషీద్ ఖాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టును గెలిపించాడు. ఈ వరుస విజయాలు, నిలకడైన ప్రదర్శనతో ఆఫ్ఘనిస్థాన్ ప్రపంచ క్రికెట్‌లో ఒక బలమైన జట్టుగా ఎదుగుతోంది.

న్యూజిలాండ్ వీధుల్లో సామాన్యుల్లా భారత క్రికెటర్లు.. వీడియో వైరల్!

- న్యూజిలాండ్ వీధుల్లో షికారు చేసిన రోహిత్ శర్మ, కుల్దీప్ యాదవ్
- ఆక్లాండ్‌లో వారిని ఎవరూ గుర్తుపట్టకపోవడం విశేషం
- విదేశాల్లో క్రికెటర్లకు దొరికే స్వేచ్ఛపై సోషల్ మీడియాలో చర్చ
- ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్



భారత క్రికెట్ స్టార్లకు స్వదేశంలో ఉండే ఆదరణ, అభిమానం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. వారు బయటకు వస్తే చాలు, అభిమానులు చుట్టుముడతారు. అయితే, విదేశీ పర్యటనల్లో మాత్రం వారికి పూర్తి భిన్నమైన అనుభవం ఎదురవుతుంది. తాజాగా టీమిండియా ఆటగాళ్లు రోహిత్ శర్మ, కుల్దీప్ యాదవ్ విషయంలో ఇదే జరిగింది. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ ప్రారంభానికి ముందు రోహిత్ శర్మ, కుల్దీప్ ఆక్లాండ్ వీధుల్లో సరదాగా షికారు చేస్తూ కనిపించారు. సాధారణ దుస్తుల్లో సెక్యూరిటీ సిబ్బందితో కలిసి మాట్లాడుకుంటూ నడుస్తున్న వీరిని స్థానికులు ఎవరూ గుర్తుపట్టినట్లు కనిపించలేదు. ఎలాంటి హడావుడి లేకుండా, పూర్తి స్వేచ్ఛగా వారు తమ సమయాన్ని ఆస్వాదించారు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియో చూసిన అభిమానులు.. విదేశాల్లో భారత క్రికెటర్లకు లభించే ప్రశాంతత, వ్యక్తిగత స్వేచ్ఛపై చర్చించుకుంటున్నారు. కాగా, ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం రోహిత్ శర్మ గత వారమే న్యూజిలాండ్ చేరుకున్నాడు. ఇక కుల్దీప్ యాదవ్ ఇప్పటికే అక్కడ ముగిసిన టీ20 సిరీస్‌లో జట్టులో ఉన్నప్పటికీ, ఆడే అవకాశం రాలేదు. కనీసం వన్డే సిరీస్‌లోనైనా తుది జట్టులో చోటు దక్కించుకోవాలని ఆశిస్తున్నాడు.

భారత్‌తో సిరీస్‌కు ముందే కివీస్‌కు షాక్..

ఇద్దరు కీలక ఆటగాళ్లు ఔట్!

- భారత్‌తో వన్డే సిరీస్‌కు చాప్‌మన్, రచిన్ రవీంద్ర దూరం
- చాప్‌మన్‌కు ఎడమ తొడ కండరాల గాయం
- రచిన్ రవీంద్ర భుజం గాయం నుంచి కోలుకోలేదు
- తొలి మూడు వన్డేలకు హెన్రీ నికోల్స్ ఎంపిక
- చివరి రెండు వన్డేలకు డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్ జట్టులోకి



భారత్‌తో వన్డే సిరీస్‌కు ముందు న్యూజిలాండ్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు కీలక ఆల్‌రౌండర్లు మార్క్ చాప్‌మన్, రచిన్ రవీంద్ర గాయాల కారణంగా సిరీస్ మొత్తానికి దూరమయ్యారు. ఇప్పటికే గాయాలతో ఇబ్బందులు పడుతున్న ఈ ఇద్దరూ కోలుకోవడానికి మరింత సమయం అవసరమని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఐదు వన్డేల సిరీస్‌కు ముందు ఈ పరిణామం కివీస్ జట్టుకు ఆందోళన కలిగిస్తోంది. మార్క్ చాప్‌మన్ ఎడమ తొడ కండరాల గాయంతో బాధపడుతున్నాడు. ఇటీవల నిర్వహించిన ఎంఆర్ఐ పరీక్షల్లో గాయం పూర్తిగా తగ్గలేదని తేలింది. మరో రెండు వారాల పాటు విశ్రాంతి, పునరావాస చికిత్స అవసరమని వైద్యులు సూచించారు. మరో ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర భుజం గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోలేదు. వైట్‌బాల్ క్రికెట్‌లో ఫీల్డింగ్ చేసే స్థాయికి అతడి భుజం మెరుగుపడలేదని కోచ్ రాబ్ వాల్టర్ తెలిపాడు. ఈ నెలలో భారత్‌తో టెస్టు సిరీస్ కూడా ఉండటంతో అతడి విషయంలో ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోబోమని స్పష్టం చేశారు. చాప్‌మన్, రచిన్ స్థానాల్లో న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు కొత్త ఆటగాళ్లను ఎంపిక చేసింది. తొలి మూడు వన్డేలకు హెన్రీ నికోల్స్ జట్టులోకి వచ్చాడు. నాలుగు, ఐదు వన్డేలకు డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్ అందుబాటులో ఉండనున్నాడు. తొలుత చివరి రెండు మ్యాచ్‌లకే ఎంపికైన టిమ్ సీఫెర్ట్ ఇప్పుడు ఐదు మ్యాచ్‌లకూ జట్టులో కొనసాగనున్నాడు. మరోవైపు మాట్ హెన్రీ సోమవారం జట్టుతో కలిశాడు. అతడి మ్యాచ్ ఫిట్‌నెస్‌ను పరిశీలించిన తర్వాత ఆడించడంపై నిర్ణయం తీసుకోనున్నారు. భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి వన్డే బుధవారం ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్‌లో జరగనుంది. ఐదు వన్డేల సిరీస్‌కు ముందు న్యూజిలాండ్ ఆటగాళ్లు సోమవారం ఆక్లాండ్‌లో సమావేశం కానున్నారు.



రైజింగ్ స్టార్స్ ఆసియా కప్

భారత-ఏ కెప్టెన్‌గా తిలక్ వర్మ.. జట్టులో హేమాహేమీలకు చోటు!

ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) నిర్వహించనున్న పురుషుల రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ కోసం భారత-ఏ జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. యువ సంచలనం తిలక్ వర్మకు జట్టు సారథ్య బాధ్యతలు అప్పగించగా, ఐపీఎల్‌లో రెండుసార్లు టైటిల్ గెలిచిన జట్టులో కీలక పాత్ర పోషించిన రజత్ పటిదార్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ టోర్నమెంట్ నవంబర్ 19 నుంచి 29 వరకు ఖతార్‌లోని దోహా వేదికగా జరగనుంది. 15 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో కీలక ఆటగాళ్లకు చోటు దక్కింది. వికెట్ కీపర్లుగా ప్రభ్‌సిమ్రన్ సింగ్, కుమార్ కుశాగ్ర ఎంపికయ్యారు. వారితో పాటు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, రింకూ సింగ్, ప్రిన్స్ యాదవ్, సూర్యాంశ్ షెడ్గే, షాబాజ్ అహ్మద్, హర్ష్ దూబే వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లు జట్టులో ఉన్నారు. గాయం కారణంగా కొంతకాలంగా ఆటకు దూరమైన సీమ్ బౌలింగ్ ఆల్-రౌండర్ హర్షిత్ రాణా పూర్తి ఫిట్‌నెస్ సాధించి జట్టులోకి పునరాగమనం చేశాడు. తనుష్ కోటియన్, విప్రాజ్ నిగమ్, అర్షద్ ఖాన్‌లతో జట్టు కూర్పు సమతూకంగా కనిపిస్తోంది. గత ఏడాది దోహాలో జరిగిన టోర్నీలో పాల్గొన్న భారత-ఏ జట్టుతో పోలిస్తే ఈసారి సెలక్టర్లు భారీ మార్పులు చేశారు. గత జట్టు నుంచి కేవలం వైభవ్ సూర్యవంశీ, సూర్యాంశ్ షెడ్గే, హర్ష్ దూబే మాత్రమే తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. గత కెప్టెన్ జితేష్ శర్మ, వైస్ కెప్టెన్ నమన్ ధీర్‌లతో పాటు పలువురు ఆటగాళ్లను వివిధ కారణాలతో ఎంపిక చేయలేదు. ఈ టోర్నమెంట్‌లో భారత-ఏ జట్టు గ్రూప్-బిలో ఉంది. ఇదే గ్రూప్‌లో యూఏఈ, నేపాల్, పాకిస్థాన్-ఏ జట్లు ఉన్నాయి. గ్రూప్-ఏలో బంగ్లాదేశ్-ఏ, శ్రీలంక-ఏ, ఆఫ్ఘనిస్థాన్-ఏ, హాంకాంగ్ ఉన్నాయి. భారత్ తన తొలి మ్యాచ్‌ను నవంబర్ 20న నేపాల్‌తో ఆడనుంది. అనంతరం నవంబర్ 22న పాకిస్థాన్-ఏ జట్టుతో, నవంబర్ 24న యూఏఈతో తలపడనుంది. ప్రతి గ్రూప్ నుంచి టాప్-2 జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. నవంబర్ 26, 27 తేదీల్లో సెమీఫైనల్స్, నవంబర్ 29న ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది.

భారత-ఏ జట్టు:

తిలక్ వర్మ (కెప్టెన్), రజత్ పటిదార్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), రింకూ సింగ్, కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), సూర్యాంశ్ షెడ్గే, షాబాజ్ అహ్మద్, విప్రాజ్ నిగమ్, హర్ష్ దూబే, తనుష్ కోటియన్, హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, అర్షద్ ఖాన్.



2008 నాటి పరిస్థితులు వేరు..

ఇప్పుడు ఐపీఎల్ క్యాలెండర్ మార్చాలి

లలిత్ మోదీ

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వ్యవస్థాపకుడు లలిత్ మోదీ, టోర్నమెంట్ నిర్వహణలో భారీ మార్పులకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం మార్చి-మే నెలల మధ్య జరుగుతున్న ఐపీఎల్‌ను అక్టోబర్-ఏప్రిల్ మధ్య కాలానికి మార్చాలని, జనవరిలోనే ప్రారంభించి మ్యాచ్‌ల సంఖ్యను 94కి పెంచాలని సంచలన ప్రతిపాదన చేశారు. ఈ మార్పులకు వీలుగా అంతర్జాతీయ క్యాలెండర్‌ను సర్దుబాటు చేసేందుకు ఐసీసీ చైర్మన్ జై షా చొరవ చూపాలని ఆయన కోరారు. క్రిక్‌బజ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో లలిత్ మోదీ తన ప్రణాళికలను వివరించారు. "2008లో ఐపీఎల్ ప్రారంభించినప్పుడు ఏప్రిల్-మే నెలలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి, ఇప్పుడు పరిస్థితులు మారాయి. అప్పట్లో ఎనిమిది జట్లతో 59 మ్యాచ్‌లు ఉండేవి, కానీ ఇప్పుడు బీసీసీఐ జట్ల సంఖ్యను 10కి పెంచింది. 10 జట్లతో పూర్తిస్థాయి హోమ్ అండ్ అవే పద్ధతిలో టోర్నీ నిర్వహించాలంటే 94 మ్యాచ్‌లు అవసరమవుతాయి. ఇది పాత ఫార్మాట్‌తో పోలిస్తే దాదాపు 60% అధికం" అని ఆయన పేర్కొన్నారు. టోర్నమెంట్ చివరి దశలో వేడి, తేమ కారణంగా ఆటగాళ్లు, ప్రేక్షకులు ఇబ్బంది పడుతున్నారని మోదీ అన్నారు. మ్యాచ్‌ల సంఖ్య పెరిగినప్పుడు, అదే తక్కువ సమయంలో టోర్నీని ముగించడం వల్ల ఆటగాళ్లపై తీవ్ర ఒత్తిడి పడుతుందని, దీన్ని అధిగమించాలంటే సుదీర్ఘ సీజన్ అవసరమని వాదించారు. "ఫుట్‌బాల్ లీగ్స్ మాదిరిగా వారాంతపు మ్యాచ్‌లు, సరైన సమయాలు, సౌకర్యవంతమైన స్టేడియం వాతావరణం కల్పించడం ద్వారా అభిమానులకు మెరుగైన అనుభూతిని అందించవచ్చు" అని ఆయన తెలిపారు. ఈ ఏడాది ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ కూడా టోర్నీని రెండు విండోలుగా విభజించే ఆలోచనను ప్రస్తావించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ మార్పుల కోసం అంతర్జాతీయ, దేశీయ క్రికెట్ షెడ్యూళ్లలో మార్పులు అవసరమని మోదీ అంగీకరించారు. "భవిష్యత్తులో ద్వైపాక్షిక సిరీస్‌లు, ఐసీసీ టోర్నీల ద్వారా వచ్చే ఆదాయం తగ్గే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో బీసీసీఐకి ఐపీఎల్ ఒక జీవనాడిగా మారుతుంది. అందుకే ముందుచూపుతో ప్రణాళికలు వేయాలి" అని ఆర్థిక కోణాన్ని విశ్లేషించారు. ఈ విషయంలో ఐసీసీ చైర్మన్‌గా జై షా తన పలుకుబడిని ఉపయోగించి నాయకత్వం వహించాలని లలిత్ మోదీ కోరారు. "ఐపీఎల్‌ను బలోపేతం చేస్తూనే, ఇతర దేశాల బోర్డుల ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఒక ఒప్పందాన్ని కుదర్చగలరని ఆశిస్తున్నాను. ఇది జై షా ఛైర్మన్‌షిప్‌లో ఒక చారిత్రాత్మక విజయంగా నిలుస్తుంది. 2008 నాటి పరిస్థితులకు అనుగుణంగా ఐపీఎల్‌ను నిర్మించాం. ఇప్పుడున్న పరిస్థితులకు తగ్గట్టుగా దాన్ని పునర్‌నిర్మించాల్సిన సమయం వచ్చింది" అని ఆయన తన వాదనను ముగించారు.



రూ.800 కోట్ల క్లబ్‌లోకి 'జైలర్ 2'..

కోలీవుడ్‌లో రజనీకాంత్ సరికొత్త రికార్డ్!

- ప్రపంచవ్యాప్తంగా రూ. 800 కోట్లు దాటిన 'జైలర్ 2' వసూళ్లు
- ఈ ఘనత సాధించిన తొలి తమిళ చిత్రంగా సరికొత్త రికార్డ్
- 18 రోజుల్లోనే ఈ అరుదైన మైలురాయిని అందుకున్న సినిమా
- రజనీకాంత్ పాత రికార్డులను సైతం అధిగమించిన వసూళ్లు
- భారత్‌లో రూ. 456 కోట్లకు పైగా నెట్ కలెక్షన్లు

సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. విడుదలైన 18 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 800 కోట్ల వసూళ్ల మార్క్‌ను దాటిన తొలి తమిళ చిత్రంగా ఈ సినిమా రికార్డు నెలకొల్పింది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో అక్టోబర్ 15న విడుదలైన ఈ యాక్షన్ కామెడీ సీక్వెల్, వసూళ్లలో తన జోరును కొనసాగిస్తోంది. ప్రముఖ ట్రేడ్ ట్రాకర్ 'సాక్‌నిల్క్' వెల్లడించిన గణాంకాల ప్రకారం.. 18వ రోజు నాటికి ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 808 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇందులో దేశీయంగా రూ. 456 కోట్ల నెట్ (సుమారు రూ. 534 కోట్ల గ్రాస్) రాబట్టగా, విదేశాల్లో రూ. 273-274 కోట్ల వరకు వసూళ్లు సాధించింది. 18వ రోజైన ఆదివారం ఒక్కరోజే భారత్‌లో రూ. 11.2 కోట్ల నెట్ కలెక్షన్లు రావడం విశేషం. ఈ భారీ వసూళ్లతో 'జైలర్ 2' తమిళ చిత్ర పరిశ్రమలో మునుపటి రికార్డులన్నింటినీ బద్దలు కొట్టింది. రజనీకాంత్ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిన '2.0' చిత్రం లైఫ్‌టైమ్ కలెక్షన్లను కూడా ఇది అధిగమించింది. అంతేకాకుండా 'పీకే', 'ఛావా' వంటి చిత్రాల మొత్తం వసూళ్లను కూడా దాటి 2026లో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రాలలో ఒకటిగా నిలిచింది. ఈ వారం చివర్లో 'రామాయణ' వంటి భారీ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో 'జైలర్ 2' వసూళ్ల వేగం కొంత తగ్గే అవకాశం ఉంది.



48 ప్రభుత్వ స్కూళ్లను దత్తత తీసుకున్న మంచు లక్ష్మి

గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యమని వెల్లడి

సంగారెడ్డి జిల్లా చౌటకూర్ స్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్ ప్రారంభం

ప్రముఖ సినీ నటి, సామాజిక కార్యకర్త మంచు లక్ష్మి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నడుం బిగించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నట్టు ఆమె తెలిపారు. తన 'టీచ్ ఫర్ చేంజ్' స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని 48 ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకున్నట్లు ప్రకటించారు. ఈరోజు సంగారెడ్డి జిల్లాలో పర్యటించిన మంచు లక్ష్మి... చౌటకూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ 'టీచ్ ఫర్ చేంజ్' ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ స్మార్ట్ క్లాస్‌రూమ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన లక్ష్మి... గ్రామీణ విద్యార్థుల కోసం అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. దత్తత తీసుకున్న పాఠశాలల్లో స్మార్ట్ ఎల్ఈడీ టీవీలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, ఇతర మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు ఆమె వివరించారు. నాణ్యమైన విద్య ద్వారానే విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని, అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు తనవంతు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు.

ప్రేమలో దారుణంగా మోసపోయా

రెజీనా కసాండ్రా



- ప్రేమలో మోసపోయి డిప్రెషన్‌కు గురయ్యానన్న రెజీనా
- 2020లో తన జీవితంలో ఈ చేదు అనుభవం ఎదురైందని వెల్లడి
- ఇతరుల ప్రేమ కన్నా మనల్ని మనం ప్రేమించుకోవడం ముఖ్యమన్న నటి

విభిన్నమైన పాత్రలతో నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ రెజీనా కసాండ్రా... తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి సంచలన విషయాలు వెల్లడించారు. గతంలో తాను ప్రేమలో దారుణంగా మోసపోయానని, ఆ కారణంగా తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్లానని ఆమె తెలిపారు. ప్రస్తుతం నయనతార ప్రధాన పాత్రలో నటించిన 'మూకుత్తి అమ్మన్ 2' (తెలుగులో 'మహాశక్తి') చిత్ర ప్రచార కార్యక్రమాల్లో ఈ వ్యాఖ్యలు చేశారు. తన గత ప్రేమ బంధం గురించి మాట్లాడుతూ... "2020లో నా జీవితంలో ఊహించని ఘటన జరిగింది. నేను ప్రేమించిన వ్యక్తి నన్ను మోసం చేయడంతో ఆ బంధం ముగిసిపోయింది. ఆ పరిణామం నన్ను మానసికంగా కుంగదీసింది. చాలా కాలం డిప్రెషన్‌తో బాధపడ్డాను. ఆ బాధ నుంచి కోలుకోవడానికి చాలా సమయం పట్టింది" అని రెజీనా భావోద్వేగానికి గురయ్యారు. ఈ కష్టకాలం నుంచి బయటపడటానికి తనకు తానే సమయం కేటాయించుకోవడం ఎంతో సహాయపడిందని ఆమె అన్నారు. "ఇతరుల నుంచి ప్రేమను ఆశించే ముందు, మనల్ని మనం ప్రేమించుకోవడం చాలా ముఖ్యం" అని పేర్కొన్నారు. యువతులు లైంగిక వేధింపులు వంటి చేదు అనుభవాలు ఎదుర్కొన్నప్పుడు తమను తాము నిందించుకోవద్దని సూచించారు. బాధను మనసులో దాచుకోకుండా, నమ్మకమైన వారితో పంచుకొని ధైర్యంగా ముందుకు సాగాలని ఆమె సలహా ఇచ్చారు.



'ఓ మైసా రే'.. రష్మిక 'మైసా' నుంచి ఫస్ట్ సింగిల్ విడుదల

నేషనల్ క్రష్' రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'మైసా' నుంచి మేకర్స్ కీలక అప్‌డేట్ విడుదల చేశారు. ఈ సినిమా నుంచి 'ఓ మైసా రే' పేరుతో తొలి పాట లిరికల్ వీడియోను సోమవారం ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. మహిళా శక్తిని, ఆత్మగౌరవాన్ని చాటిచెప్పేలా ఈ పాట సాగుతూ శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రముఖ సంగీత దర్శకుడు జేక్స్ బిజోయ్ స్వరపరిచిన ఈ గీతానికి, సుప్రసిద్ధ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ శక్తివంతమైన సాహిత్యాన్ని అందించారు. గాయని సింధుజ శ్రీనివాసన్ తన గాత్రంతో పాటకు ప్రాణం పోశారు. కథానాయిక పాత్రలోని ధైర్యం, తెగువ, పోరాట స్ఫూర్తిని ఈ పాట ప్రతిబింబిస్తోంది. ముఖ్యంగా, ఈ లిరికల్ వీడియోలో రష్మిక మునుపెన్నడూ చూడని సరికొత్త అవతారంలో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. శక్తివంతమైన గోండు గిరిజన మహిళగా ఆమె లుక్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. బృందా మాస్టర్ కొరియోగ్రఫీ పాటకు అదనపు ఆకర్షణగా నిలిచింది. రవీంద్ర పుల్లే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్‌ఫార్ములా ఫిలింస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. రొటీన్ పాత్రలకు భిన్నంగా రష్మిక చేస్తున్న ఈ ప్రయోగంపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. 'మైసా' చిత్రాన్ని నవంబర్ 27న తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**